

## మనిషి దైవంగ పెరగటం బాబామతం

# గురుకృప

విజయదశమి సంచిక



**భక్తుడు :** గురువుగారూ! నేను సేవ చేయాలనుకున్నపుడు ఎలాంటి పనిని ఎంచుకోవాలో తెలుసుకోవడం ఎలా?

**గురువుగారు :** నేను ముందు చెప్పినట్లు మీరు చేసే పని మీ ప్రేమకు వ్యక్తీకరణ కావాలి. మనం ప్రేమను వ్యక్తీకరించేందుకు ఒక పనిని ఎంచుకునేటపుడు అవి మన శక్తిసామర్థ్యాలకు అనుగుణంగా ఉండాలి. అంతేగాని మన ఇష్టాయిష్టాలననుసరించి ఉండకూడదు. మన అహంకారానికి దెబ్బ తగిలే అవకాశం ఉన్న పనుల నుండి మనం తప్పించుకోకూడదు. అలా తప్పించుకొని అది కూడా ప్రేమకు వ్యక్తీకరణే అని సమర్థించుకోకూడదు. కాబట్టి ఈ వ్యక్తీకరణల మధ్య తేడాలుంటాయి. ఒకవేళ మనం జాగ్రత్త వహించవలసివస్తే మనం ఒక పనికి (వ్యక్తీకరణకు) బదులు మరొక పనిని (వ్యక్తీకరణను) ఎందుకు ఎంచుకున్నాం అనే విషయంలో జాగ్రత్త వహించాలి. అక్కడ మనం జాగరూకతతో ఉండాలి. ఉదాహరణకు, అక్కడ చాలా అధికారదర్పంతో ప్రవర్తించే వ్యక్తి ఉన్నాడు, ఆయనతో పనిచేయవలసి వస్తుందని మీరు కొన్ని పనులను ఎంచుకోకపోవచ్చు. లేదూ, నేను చాలా మేధావిని కాబట్టి వంటపని చెయ్యను అని మీరనుకోవచ్చు (గురువుగారు నవ్వుతూ) పనిని ఎంచుకోవలసి వచ్చినపుడు మీరు ఇలాంటి విషయాలలో చాలా జాగ్రత్తగా ఉండాలి.

ఇటువంటి వ్యక్తీకరణల వెనుక గల ప్రాథమిక సూత్రాన్ని మాత్రం ఎవ్వరూ మర్చిపోకూడదు. లేకపోతే వాటివల్ల ప్రయోజనం ఉండదు. ఒక పని (వ్యక్తీకరణ) మన అహంకారాన్ని పెంచుతుందా, పోగొడుతుందా అనే విషయంలో మనం జాగ్రత్తగా ఉండాలి. ఇది చాలా సూక్ష్మంగా, తికమక పెట్టేలా ఉంటుంది. అది ఎలాంటి వ్యక్తీకరణ అయినా అది మిమ్మల్ని మృదువుగా చేసేలా ఉండాలి. **ప్రేమ యొక్క ప్రధానమైన ఉద్దేశ్యం అహంకారం లేకుండా చెయ్యడమే** – అక్కడ మిమ్మల్ని మీరు కోల్పోవాలి. కాబట్టి మీరు ఒక్క విషయం గుర్తు పెట్టుకుంటే చాలు. మనం మన అహంకారాన్ని కొంత కోల్పోవాలి. మీరు ఆ పని పూర్తి చేసిన తర్వాత మీకు మీరు తేలికగా అనిపించాలి. మళ్ళీ ఆ పని చేస్తే ఇంకొన్ని గ్రాములు (అహంకారం) పోగొట్టుకోవాలి. మీరు మళ్ళీ చేస్తారు. మళ్ళీ ఇంకొన్ని గ్రాములు (అహం) పోగొట్టుకుంటారు. మీరు ఎంతగా అహంకారాన్ని కోల్పోతారో అంతగా ప్రయోజనం పొందుతారు.


**– శ్రీబాబూజీ**

సంపుటి : 27
సంచిక : 4

విజయదశమి సంచిక
13 అక్టోబర్ 2024



గురుకృప





# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది. – శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో

పథగామి – గురుకృప 4
మహాత్ములకు కేన్సర్ – మాస్టర్ ఇ.కె. 7
తంతులు, ముహూర్తాలు, వాస్తులు – శ్రీబాబూజీ 9
14 గురుకృపాలహరి – గురుకృప
23 ప్రేమ సృష్టి... సాయి దృష్టి – మహేష్, మోతీనగర్




నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు

GURUKRUPA
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# పథగామి

## సాధనా మార్గాలు...

### బాబా మనకు అందించిన సాధనా మార్గం...

### పనిచేయి, సద్గ్రంథపఠనం, దేవుని నామస్మరణ...

శ్రీసాయిబాబా పట్ల మనకున్న ప్రేమను వ్యక్తం చేసుకోవడానికి, సాయిబాబా మనపట్ల చూపించే ప్రేమానుగ్రహాన్ని, ప్రసాదించిన ఆనందాన్ని చవిచూడటానికి, అనుభవించడానికి శ్రీబాబూజీ సూచించిన సాధనామార్గాల్లో ప్రధానమైనవి–సత్సంగం, సాయిబాబా నామస్మరణ, పారాయణ. ఇటు మితిమీరిన భోగాన్ని, అటు అలవిమాలిన హఠయోగాన్ని శ్రీసాయి ఆమోదించలేదు. బాబా మనకు ఆదేశించింది "మధ్యే మార్గం" అని వివరించిన శ్రీబాబూజీ, సాధనాపరంగా భక్తుల చేత అదే మార్గాన్ని అవలంబింపచేసారు. వారు సూచించిన మార్గాలన్నీ అందరికీ సులభతరమైనవి. ఆచరణాత్మకమైనవి. సాయిపట్ల ప్రేమను పెంపొందించి, సదా "శ్రీసాయి ఊసు, ధ్యాసలో" ఉండేట్లు చేయడమే సాధనామార్గాల పరమలక్ష్యమని, మన హృదయాంతరాళాల్లో ఉన్న ప్రేమను పైకి వచ్చేట్లు చేయడమే కాకుండా, సాయి ప్రేమానుగ్రహాన్ని గుర్తించే హృదయయోగ్యతను మనకు ఈ సాధనలు ప్రసాదిస్తాయని శ్రీబాబూజీ సాధనాఫలాలను వివరించారు.

**పెద్దల కోరిక :** "ఈ పదిహేను రోజులలో ఏం చేసుకొచ్చావ్" అని అడిగారు గురువు. దూరప్రాంతం నుండి వచ్చిన ఒక యువకుడిని. "పనైతే పెద్దగా సాగలేదుగానీ, మన పుస్తకాలు మాత్రం బాగా చదవగలిగాను. చదువుతుంటే ఒళ్ళు తెలియలేదు" అన్నాడా యువకుడు.

"అయితే పని మానేసి చదివావన్నమాట. **ఆ పుస్తకాలలో పని చేయమని ఉందా? మానమని ఉందా?"** ప్రశ్నించారు గురువు.

**"చేయమనే ఉందండీ"** అన్నాడతను తన తలను దించుకుంటూ.

**"పని చేయమనే కాదు, పని ఎలా చేయాలో కూడా ఉంది. అవునా?"** అడిగారు గురువు.

"అవునండీ" అన్నాడతను.

"మరి ఆ పుస్తకాలను చదవడంలో పడి, పనిని విడిచిపెట్టడంలో అర్థం ఏమిటి? ఇలా చేయడం వల్ల నీతోపాటు ఆ పుస్తకాలకు కూడా చెడ్డపేరు వస్తుంది కదా. మీరిలా చేస్తున్నపుడు ఇలాంటి పుస్తకాలు చదివి కుర్రవాళ్ళు చెడిపోతున్నారని మీ పెద్దవాళ్ళు వెష్ట పడడంలో తప్పేముంది? కొందరు డిటెక్టివ్ పుస్తకాలు, కాలక్షేపానికి మాత్రమే పనికివచ్చే నవలలూ, వార, మాసపత్రికలు



చదువుకుంటూ అలా ఉండిపోతున్నారు. (ఇప్పుడు సాంఘిక మాధ్యమాల వ్యవస్థలు) ఇంకొందరు నీలాగా పెద్దల గ్రంథాలను చదువుకుంటూ కాలాన్ని మర్చిపోతున్నారు. ఈ రెండు రకాల వాళ్ళు చేస్తున్నదేమిటి? పనిని ఎగ్గొట్టడమేకదా. పనిని ఎగ్గొడుతున్నపుడు ఇక వాడు ఏ పుస్తకాన్ని చదివితే మాత్రం ఏమిటి? ఏ రాయైతేనేం పళ్ళూడగొట్టుకోవడానికి".

"తప్పైపోయిందండీ! ఎందుకనో వాటిని వదిలిపెట్టలేక అలా ఉండిపోయాను" అన్నాడా యువకుడు బాధగా. "నిజమే నీవన్నది. అలాంటి గ్రంథాలు చదువుతున్నపుడు విడిచిపెట్టలేం. మరి అలాగని కర్తవ్యాన్ని కూడా విడిచిపెట్టకూడదు కదా! విడిచిపెడితే ఇక వాటిని చదివినందుకు సార్థకత ఏమున్నది? పని చేయడంలో కావాల్సిన నేర్పరితనం అందించడానికి గదా ఆ గ్రంథాలున్నది. సైన్స్ స్టూడెంట్ ఏం చేస్తున్నాడు – కొంతసేపు చదువుకుంటున్నాడు. మరికొంతసేపు ఆ చదువుకొన్నది చేసి చూస్తున్నాడు (థియరీ అండ్ ప్రాక్టికల్), మనమూ అదే చేయాలి. పెద్దల గ్రంథాలనూ చదువుతూ ఉండాలి. ఆ చదివిన  ప్రకారం ఆచరిస్తూ ఉండాలి. రోజు మొత్తాన్ని చదవడానికి, చేయడానికీ తగినపాళ్ళలో విభజించుకోవాలి. **చదవడమూ మానకూడదు. ఆచరించడమూ మానకూడదు.** ఏమంటావ్?"

బోధపడుతోంది అన్నట్లుగా చూశాడతను. అతనివైపు అనునయంగా చూస్తూ గురువు ఇంకా ఇలా అన్నారు "రోజూ ఉదయం లేచిన తరువాత దినచర్యలోకి దిగబోయే ముందు, ఈ గ్రంథాలను చదువుకుంటే బాగుంటుంది. అపుడు దినచర్య సక్రమంగా నిర్వహించుకోవడానికి కావలసిన సందేశమూ, ప్రోత్సాహమూ లభిస్తాయి. అలాగే రోజూ రాత్రిపూట పడుకోబోయే ముందు ఈ గ్రంథాలను చదువుకోవడం మంచిది. అపుడు ఈ గ్రంథాల వెలుగులో మనం జరిపిన దినచర్యను సమీక్షించుకోవడానికి, కావలసిన సర్దుబాటులను గ్రహించడానికి వీలు కలుగుతుంది. ఇంకా ట్రైన్లో ప్రయాణం చేస్తున్నపుడు ఏదో చేయడం కన్నా ఈ గ్రంథాలు చదువుకోవడం మంచిది. అపుడు **ట్రైన్** ప్రయాణంతోపాటుగా మన జీవిత ప్రయాణానికి కావలసిన **'ట్రైని'ంగ్** కూడా పొందిన వాళ్ళమవుతాం.

అలాగే ఒక్కొక్కపుడు ఎవరికోసమో వేచి ఉండవలసి వస్తుంది. అక్కడ ఉండక తప్పదు. ఆ వ్యక్తి వచ్చేలోగా చేసేది ఏమీ కనపడదు, అపుడేం చేయాలి? మనకు నచ్చిన పుస్తకాన్ని చదువుకొంటూ కూర్చోవాలి. అపుడు వేచి చూడటం వల్ల కలిగే అసహనం, టెన్షన్ కలగకపోగా, ఆ వచ్చిన వ్యక్తితో మాట్లాడటానికి కావలసిన ప్రశాంతత మనస్సుకు లభిస్తుంది. లేకపోతే **వెయిటింగ్** తరువాత



**ఫైటింగ్** ప్రారంభమయ్యే ప్రమాదం ఉన్నది. కొందరికి చూసి చూసి కళ్ళు కాయలు కాస్తాయి. ఇంకొందరికి ఒళ్ళు మండి పోతుంది. కళ్ళు కాయలు కాస్తే కొంతవరకు ఫరవాలేదు కానీ, ఒళ్ళు మండిపోతే ప్రమాదం కదా! మరి. అందుకని ఆ సమయాన్ని పెద్దల గ్రంథాలను చదువుకోవడానికి వినియోగించడం అన్ని విధాల శ్రేయస్కరం. ఏమంటావ్?" బాగున్నది, బోధపడింది అన్నట్లుగా చూసాడతను.

లోతులను తడిమిచూసే చూపులతో గురువు ఇంకా ఇలా అన్నారు "ఇంతకూ పెద్దల గ్రంథాలు ఎప్పుడూ మనతో ఉండాలి. అవి మన జీవితానికి పెట్రోలు లాంటివి. ప్రయాణం సాగుతున్నకొద్దీ ఆ పెట్రోలు మరింతగా మనకవసరం అవుతూ ఉంటుంది. మంచి డ్రైవరు ఏం చేస్తున్నాడు – తన వాహనంలో పెట్రోలు, ప్రయాణానికి తగినట్లుగా ఉండేటట్లు చూసుకుంటూ వాహనాన్ని నడుపుతున్నాడు. అలాగే మనం కూడా పెద్దల గ్రంథాల నుండి తగిన **స్ఫూర్తిని** పొందుతూ జీవిత ప్రయాణాన్ని సాగించాలి. పెద్దల గ్రంథాలు 'దిక్సూచి'లాంటివి. నావికుడు ఏం చేస్తున్నాడు, దిక్సూచి సాయంతో దిక్కులను గమనించుకొంటూ కావాల్సిన పద్ధతిలో భద్రంగా ప్రయాణం చేస్తున్నాడు. అలాగే మనం కూడా, పెద్దల గ్రంథాలు మనకు ధర్మపథాన్ని సూచిస్తూ ఉండగా జీవిత ప్రయాణాన్ని సక్రమంగా సాగిస్తూ ఉండాలి. ఇంతకూ ఏం చెప్పుకున్నాం? పెద్దల గ్రంథాలను పెట్రోల్‌తోను, దిక్సూచితోను పోల్చుకోవడం జరిగింది అంటే, ఆ పెద్దల గ్రంథాలు రెండు విధాలైన సామర్థ్యాన్ని కలిగి ఉంటాయన్న మాట, పెట్రోల్‌లాగా ఉత్సాహం అనే శక్తినిచ్చి మనను నడిపించగలవు. దిక్సూచిలాగా ధర్మమార్గాన్ని ఎప్పటికప్పుడు సూచించగలవు. తమ గ్రంథాల నుండి ఈ రెండువిధాలైన ప్రయోజనాలను పొందుతూ మన జీవితాలను సార్థకంగా నడుపుకోవాలని మన పెద్దలైన ఆ గ్రంథకర్తల కోరిక. ఆ యువకుడు చక్కని స్ఫూర్తిని పొందినట్లు కనిపించాడు. మీరు చెప్పినట్లుగా తప్పక నడుచుకుంటాను అన్నట్లు గురువువైపు చూసాడు.

గురువు అతని వైపు తృప్తిగా చూసారు. చెప్పినది గ్రహించగలిగాడు, గ్రహించినట్లు నడుచుకుంటాడు అన్న విశ్వాసం ఆ చూపుల నుండి వ్యక్తమవుతున్న ఆ యువకుణ్ణి **"ఆశీఃపూర్వకంగా స్పృశిస్తున్నది వారి చూపు"** ఆ స్పర్శకు **'ఒదిగి'** పోతున్నట్లుగా, ఆ స్పర్శలో **'ఎదిగి'** పోతున్నట్లుగా గోచరించాడు ఆ యువకుడు. "నన్ను మీరు తప్పకుండా ఉపయోగించుకోండి. మీకు ఉపయోగపడటంలోనే నాకు ఆనందం ఉన్నది. నేను మీకు ఉపయోగపడటానికి సిద్ధంగా ఉన్నాను" అంటారు గురువు.

**– మాటల మధ్యలో రాలిన ముత్యాలు**

# మహాత్ములకు కేన్సర్



**"రామకృష్ణ పరమహంసకి గొంతులో కేన్సర్ వచ్చిందట. రమణ మహర్షికి కూడా కేన్సరు వచ్చిందట. పూర్వజన్మలో చేసిన పాపం వ్యాధిరూపంగా పీడిస్తుందని కొందరు చెబుతారు. మరి కొందరు రామకృష్ణ పరమహంసని, రమణమహర్షిని అవతారమూర్తులు అంటారు. ఇదంతా గందరగోళంగా ఉంది. ఇలాంటి విషయాలను గూర్చి ఏమని అర్థం చేసుకోవాలి?"**

"మొదటిది రామకృష్ణ పరమహంసకి, రమణమహర్షికీ పూర్వజన్మలు లేవు అనుకోనక్కరలేదు. పూర్వజన్మలు ఉంటే అవతారం కాదు అనీ భావించనక్కరలేదు. తనకి, అర్జునుడికీ కూడా చాల జన్మలు గడిచినవనీ, తాను వాని నెరుగుదునని కృష్ణుడు భగవద్గీతలో స్పష్టంగా చెప్పాడు. అవతారం అన్నది దిగివచ్చే వెలుగుకి సంబంధించినది కాని, దేహానికి సంబంధించినది కాదు. దేహం భౌతిక ద్రవ్యంతో ఏర్పడి ఉన్నది కనుక, దాని ధర్మాలు దానికి వర్తిస్తాయి. దాని కర్మననుసరించి అది పరిణామాన్ని చెందుతుంది. కరెంటు తీగ పాతది అయినపుడు తిన్నగా ప్రసారం కాదు. ఇంక కరెంటు గొప్ప ఏమున్నది అనరాదు. దేహం ధర్మసాధకమైన ఒక పనిముట్టు. దానికి కలిగిన పరిణామాలకి, ఆ దేహంలో నివాసం యున్న అవతారమూర్తియైన వెలుగుకీ ఏమీ సంబంధం లేదు.

ఇక పూర్వజన్మకృతమైన పాపం వ్యాధి రూపంలో పీడిస్తుంది అన్న విషయం సత్యమే కానీ, అది దేహంలో ఉన్నవాడు పీడింపబడే స్థితిలో ఉన్నప్పుడు మాత్రమే సత్యమవుతుంది. రమణమహర్షి దేహానికి వ్రణం కలిగినపుడు ఆయన పీడింపబడలేదు అన్న విషయం అందరికీ తెలిసింది. దానికి ఆపరేషన్ చేసేటపుడు కూడా ఆయన పీడింపబడలేదు. మత్తుమందు లేకుండానే ఆయన ఆపరేషన్ చేయించుకున్నారు. ఆపరేషన్ చేస్తూ ఉన్నంతసేపూ తాను ఆ భాగంలో ఉండటం మానివేసారు. ఇది అప్పటివారు కళ్ళారా చూచినదే. ఇక బాధపడేవారికి వ్యాధులు పూర్వజన్మకృత పాపం వల్ల కలుగుతాయి కానీ అందరికీ కాదు. వ్యాధులు అందరికీ ఒకే కారణం వల్ల కలుగవు. కర్మబద్ధులైన వారికి పూర్వజన్మ వల్ల కలుగుతాయి. సిద్ధ పురుషులకు వేరే కారణాల వల్ల కలుగుతాయి. వారు చేసిన ఆధ్యాత్మిక సాధన వలన ప్రాణమయ శరీరంలో జరిగిన మార్పులకు భౌతిక శరీరం ఒక్కొక్క పరిస్థితులలో వ్యాధిగ్రస్తం అవుతుంది. జీవుడు భౌతిక శరీరాన్ని అనేక పర్యాయాలు ధరిస్తూ వదులుతూ ఉంటాడు అనే సత్యం అనుభవానికి వచ్చాక, కొందరు శరీర కర్మను గూర్చి అంతగా



పట్టించుకోరు. కొందరు యోగాభ్యాసం వల్ల శరీరాన్ని కూడా పరిశుద్ధి చేసుకొనడానికి కృషి చేస్తారు. కొందరికి దానిమీద అంత పట్టింపు ఉండదు. ఒకొక్కప్పుడు వారు అవతరించిన పని వలన కొందరికి దేహసేవ చేసుకునేందుకు తీరుబడి ఉండక పోవచ్చును. అపుడు శరీరం దాని కర్మ అది అనుభవించి తీరుతుంది.

ఇక సిద్ధులకు, అవతార పురుషులకు ఇలాంటి వ్యాధులు ఎందుకు రావాలి అనే ప్రశ్న ఉండదు. వారికి పూర్వకర్మబంధం తొలగిపోయిన తర్వాత ఇంక ఏ కర్మ వలన ఇలాంటి వ్యాధులు కలుగుతాయి అన్నది ఒక ప్రశ్న. ఒక్కొక్కపుడు ఆ సిద్ధుడు దేహం ధరించిన జాతికి సంబంధించిన కర్మ అతని దేహం ద్వారా వ్యక్తమై ఇలాంటివి జరుగుతాయి. మరొకప్పుడు యావన్మానవ జాతి విమోచనాన్ని గూర్చి ధ్యాన తపస్సులు చేసేవారికి కూడా వారి దేహం ద్వారా కొంత జాతి దుష్కర్మ ఇలా వ్యక్తం అవడం కద్దు. మరొకపుడు తమను ఆశ్రయించియున్నవారి దుష్కర్మ కూడా ఈ విధంగా వ్యక్తమై పరిష్కారం జరుగుతుంది. ఒక పెద్ద సంస్థని ఆశ్రయించుకొని వున్నవాడు ఒక తప్పుచేస్తే ఆ సంస్థ యజమాని క్షమాపణ చెప్పుకోవలసి రావడం లోకంలో మనం చూస్తూనే ఉన్నాము. ఇది కూడా అటువంటిదే. వారి అవతారతత్త్వానికి దీనివలన ఏ విధమైన లోపము కలుగదు. ఇతర మానవులు ఆశ్రయించేది దేనికోసమో, అదే వారి జీవిత పరమార్ధం.

వ్యాధులు, బాధలు గలవారు సిద్ధపురుషుల దర్శన, స్పర్శన, సాన్నిధ్యములు అనుభవించుటవల్ల వీలైనంత వరకు తొలగిపోవడం లోకానుభవ సిద్ధమే. అలా వారికి తొలగినపుడు అవి ఆ సిద్ధపురుషులకి సంక్రమిస్తాయి అన్నది కూడా వాస్తవమే. కానీ ఇది సిద్ధపురుషులందరి యెడల సత్యం కాదు. వారు వారు సాధించిన మార్గంలోని సంకల్పాన్ని బట్టి ఉంటుంది. ఒక్కొక్క యోగసిద్ధుడు రోగార్తులను ఆశీర్వదిస్తూ అది తాను స్వీకరిస్తున్నాను అని నమ్ముతాడు. ఇలా నమ్మటం అతనిలో మిగిలి ఉన్న అహంకారాన్ని సూచిస్తుంది. మరి యొక సిద్ధపురుషుడు తనలో ఉన్న పరమాత్మ నామం వల్ల రోగార్తుల బాధలు తొలగిస్తాడు. అట్టివానికి ఏమీ అంటవు కనుక సంక్రమించవు. ఏసుక్రీస్తు మున్నగువారు ఈ తరగతివారు. పై రెండు తరగతులలో మొదటితరగతివారు బట్టలుతికి ఆ నీళ్ళు ఒక తొట్టిలోనికి పట్టినట్లు చేస్తారు. మరొక తరగతి వారు విద్యుత్ ప్రసారాన్ని రాగితీగెలు ప్రసరింపచేసినట్లు చేస్తారు. మొదటితరగతి వారి సంకల్పం వల్ల బాధలు వారికి సంక్రమిస్తాయి. రెండవ తరగతి వారి సంకల్పం వల్ల తమలో నుండి ప్రవహించి సూర్యరశ్మి ద్వారా



అంతర్యామిలోనికి అంతరిస్తాయి. కాబట్టి ఆయా సాధనామార్గాల ననుసరించి సిద్ధులకు వ్యాధులు సంక్రమించటం, సంక్రమించకపోవడం ఉంటుంది. ఇన్ని చెప్పినా అప్పటి మానవజాతి యొక్క దుష్ఫలితాలు మాత్రం ఏ సిద్ధపురుషుని మీదుగానో వెళ్ళక తప్పదు. వాటి పరిణామాలే జీసస్ శిలువ వేయబడటం, కృష్ణుడు బాణంతో కొట్టబడటం, గాంధీ పిస్టల్‌తో పేల్చబడటం మొదలైనవి. ఈ తరగతికి చెందినవే రామకృష్ణ పరమహంస, రమణమహర్షి కేన్సరు మొదలైనవి. గర్భిణియైన స్త్రీకి తన గర్భంలో భాగాలే శిశువు రక్షణకి మావి, పొరలుగా ఏర్పడుతాయి. కానీ అది అనారోగ్యకరమైన శిశువైతే తల్లి శరీరంలో పెరిగిన భాగాలే సెప్టిక్, విష సంక్రమణం మొదలైనవి జరిగి తల్లి శరీరానికి విపత్కరంగా పరిణమిస్తాయి. ఈ విధంగా నాలుగు ప్రక్కల కలిపి సమన్వయించుకుంటేనేగాని పెద్దల జీవితాలను గురించిన రహస్యాలు సవ్యంగా బోధపడవు. **"ఇంతకీ సత్యం అనేది నిదానించి చూచినవాడి సొత్తు". – మాస్టర్ ఇ.కె.గారి 'ఇష్టాగోష్ఠి' నుండి**

## తంతులు, ముహూర్తాలు, వాస్తులు

**భక్తుడు :** గురువుగారూ! ఒకాయన ఏమన్నారంటే – వీరభద్రప్ప, చెన్నబసప్ప కథలో కన్యకి వివాహం చేయాలని చెప్పి బాబాగారు మంచి నక్షత్రం చూడాలి, అది చూడాలి, ఇది చూడాలి అని అన్నారు. కాబట్టి మనం ఇవన్నీ కూడా చూడాలి. అది మనకొక రూలు అన్నట్లు మాట్లాడుతున్నారు,. అలా సచ్చరిత్రలో ఉంది కాబట్టి, బాబాగారు చెప్పారు కాబట్టి అది మనం ఫాలో అవ్వాలి.

**గురువుగారు :** ఫాలో అవ్వమని చెప్పు. తప్పేముంది?

**భక్తుడు :** అన్నీ చూడాలి మనం. గోత్రాలు ఇవన్నీ చూడాలి అని అంటున్నారు.

**గురువుగారు :** సమాధి మందిరానికి శంఖుస్థాపన జరిగేటపుడు వీళ్ళందరూ వచ్చి, "బాబా! శంఖుస్థాపన చెయ్యదలచుకున్నాము ఇక్కడ...వాడా కట్టుకొని అక్కడ మేము ఒక మురళీధరుని ఆలయాన్ని కట్టుకోవాలనుకున్నాము. ఎప్పుడు చేసుకోమంటారు? మంచి ముహూర్తం చెప్పండి" అని బాబాను అడిగారు. "ముహూర్తమా, నీ మొహమా! మంచి సంకల్పం జరిగిందే ముహూర్తం. చేసేయండిరా ఇప్పుడే" అన్నారు. ఆయన అప్పుడు లెండీకి వెళుతున్నారు. ఏదీ? లెట్రిన్‌కి వెళుతున్నారు. మంచి ముహూర్తం, చేసెయ్యండి అన్నారు. గబగబా టెంకాయ తీసుకొచ్చి చేతికిచ్చారు. టెంకాయ కొట్టి లెట్రిన్‌కి వెళ్ళిపోయారాయన. అదీ ముహూర్తం. ఇపుడు సమాధి మందిరానికి శంఖుస్థాపన అలా జరిగింది. ఆయన అన్నమాటే అది. "ముహూర్తమా, నీ మొహమా!



మంచి సంకల్పం జరిగిన క్షణమే మంచి ముహూర్తం, చేసుకోండి" అన్నారు. తర్వాత ఇంకొకరితో "ఈ జాతకచక్రాలు, ఇవన్నీ తుంగలో త్రొక్కు" అన్నారు. మరి దాని సంగతి ఏమంటాం? ఇవన్నీ డైరెక్ట్‌గా మాట్లాడినపుడు రికార్డ్ చేసినటువంటివి. ఈ చెన్నబసప్పలాంటి స్టోరీస్ ఏంటనంటే ఎక్కడెక్కడినుండో తర్వాత వాళ్ళు వ్రాసుకుంటూ వచ్చినటువంటివి. బాబా అలా, అంత స్టోరీస్ చెప్పే అవకాశం లేదు. ఆయన స్టోరీస్ ఎలా చెప్తారనే విషయం 'ఖాపర్డే డైరీ'లో ఉంది. ఒకదానికి, ఒకదానికి పొంతన ఉండదు. ఒక్క స్టోరీ కూడా కంటిన్యూ కాదు, ఆయన చెప్తే. అంతే తప్పితే అంత కొహెరెంట్‌గా ఒక స్టోరీని నెరేట్ చేయరాయన. కాబట్టి ఎక్కువ అవకాశాలు దీనికే ఉన్నాయి. హస్తసాముద్రికుడు వస్తే ఏం చెప్పారు. చేయి చూపించమన్నపుడు? "నీ మొహం, వీడు నా వాసాలు లెక్కబెట్టడానికి వచ్చాడు" అన్నారు. వాడికి చేయి చూపించలేదు. మరి ఇన్ని సంఘటనల్లో కూడానూ ఆయన జ్యోతిష్యాన్ని గాని, ముహూర్తాలనుగానీ ఆయన తప్పు అనే చెప్పారు. అలా చెప్పుకుంటూనే వచ్చారు. కాబట్టి వీటన్నింటి దృష్ట్యా, ఇన్ని ఆధారాల దృష్ట్యా అది బాబా చెప్పకపోయేదానికి అవకాశం ఉంది అని చెప్పవచ్చు. ఆయన ఫక్తు ముస్లిమ్‌గా ఉండేవారు. ఆయన వ్యవహారంగాని, చెప్పే మాటగాని, చేసే సాంప్రదాయంగాని అంతా కూడా ఆయనకు సన్నిహితంగా ఉండేటువంటి భక్తులు కూడా ఆయన్ని ముస్లిమ్‌గానే భావించారు. ఆయన జాతకాలు, జ్యోతిషశాస్త్రాల సంగతి మాట్లాడే క్వశ్చన్ లేదు, అసలు ఫస్ట్ వీళ్లకందరికీ ఏం చెప్పాలంటే ఎప్పుడు కూడానూ, ఇటువంటి వాటి గురించి వచ్చినపుడు, వాస్తు, జ్యోతిష్యం అన్నపుడు, "అవి రైటో కాదో అవి మాకొద్దు. మా జీవితాల్ని నడిపించేటువంటి వారు బాబా". "ఈ గ్రహాలు నిన్నేం చేస్తాయిరా?" అని బాబానే అన్నారు. "నా శరీరాన్ని కోసి నీకు బిడ్డనిచ్చాను, ఈ గ్రహాలు నిన్నేం చేయగలవు?" అన్నారు. "ఎవరైతే భక్తిగా ద్వారకామాయిలో అడుగుపెడతారో వాడి కర్మ నశిస్తుంది. వాడి ప్రారబ్ధం నశిస్తుంది" అన్నారు. ఇక నుంచి ఆ కంట్రోల్ అంతా నేను తీసుకుంటాను అన్నారు. సద్గురువును ఆశ్రయించనంతవరకే మిగతా ఏవైనా సరే. సద్గురువును ఆశ్రయించిన తరువాత ఇక వాటి యొక్క ఇన్‌ఫ్లూయెన్స్ మనమీదేమీ ఉండదు, ఉండే ఇన్‌ఫ్లూయెన్స్ అంతా సద్గురువు యొక్క ఇన్‌ఫ్లూయెన్స్ ఉంటుంది. కాబట్టి, "నేను సాయిభక్తుణ్ణి. నా జీవితాన్ని నియమించేది బాబా. అందుకని నేను మిగతా వాటిని ఫాలో చేయనండి. అవి రైట్ కావచ్చు, తప్పు కావచ్చు. ఆ కాంట్రవర్సీ నాకెందుకు? మీరింకా అంతగా సద్గురువుకు శరణాగతి పొందలేదంటారా, మీరు చేసుకోండి. తప్పేం లేదు. నన్ను చేయమని మాత్రం అనవద్దు" అని చెప్పండి.



**భక్తుడు :** అంతేగానీ మనం అది రాంగ్ అని.

**గురువుగారు :** ఎందుకు? ఉపయోగమేముంది దానివల్ల? మన యొక్క గమ్యం ఏమిటి? బాబాపట్ల అవగాహన పెంచుకోవడం. ఆ గ్రిట్‌తో కానీ మనం నిలబడగలిగితే – అసలు నిజంగా చెప్పాలంటే **"నిజమైన ఆర్గ్యుమెంట్ ఏమిటనంటే నీ ఆచరణలో చూపించడం"**. మామూలుగా మనం ఏం చేస్తుంటామంటే–మేమంతా సాయిపథం, మా గురువుగారు ఈ వాస్తు ఒప్పుకోరు, ఈ జాతకాలు ఒప్పుకోరు. ఈ తంతులు, గింతులంతా ఏమీ లేదు... మేమంతా ఏమీ చెయ్యమండి. మీరంతా ఏమీ చెయ్యకండి. మీరు ఆ ఫోటోలు తీసెయ్యండి. ఇవి తీసెయ్యండి, అవి తీసెయ్యండి అని చెప్పి ఇళ్ళకు వెళ్ళి సత్సంగాలు చేస్తాం. మనింట్లో మాత్రం అన్నీ ఉంటాయి. మనం మాత్రం గౌరీవ్రతాలు చేస్తాము, వరలక్ష్మి వ్రతాలు చేస్తాము. వినాయకుడి ఫోటో పెట్టుకుంటాము, తద్దినాలు పెడతాము. ఏంటివన్నీ అనంటే, ఏమోనండి, నా భార్య చాదస్తంగా అన్నీ పెట్టుకుంది అంటారు. అప్పుడు నీ మాటకు విలువ లేదు. **నువ్వు ఫాలో చేసేటువంటిది, నువ్వు ఆచరిస్తే అదే పెద్ద ఆర్గ్యుమెంట్ అన్నింటికంటే.** ఎదుటివాడు ఆటోమాటిక్‌గా ఇన్‌ఫ్లూయెన్స్ అవుతాడు. మనం చెప్పేది మనం ఆచరించాలి. ముందు ఇంట్లో సరైన సత్సంగం చేసుకొని ఇంట్లో వాళ్ళకి సరైన అవగాహన ఇవ్వలేనిది, ప్రపంచాన్ని ఉద్ధరిస్తావా నువ్వు?

**భక్తుడు :** ఒకవేళ మనవాళ్ళలో ఎవరైనా అట్లా అంటుంటే, ఇది అలా కాదు అని చెప్పవచ్చా, గురువుగారూ?

**గురువుగారు :** ఇదే మాట చెప్పు. నేను సార్‌ని ఇట్లా అడిగాను. అడిగితే ఇలా చెప్పారు... ఆర్గ్యుమెంట్ వల్ల ఉపయోగమేమీ లేదు. ఎందుకంటే ఎవరి అభిప్రాయాలు వాళ్ళకున్నాయి. ఆయన చెప్పేది నువ్వు తెలుసుకోవాలని నీకేమీ లేదు. నీ పాయింట్ వాళ్ళ మీద రుద్దాలని నువ్వు, ఆయన పాయింట్ నీమీద రుద్దాలని... దీనివల్ల ఉపయోగం ఏమిటి? సత్సంగం అంటే ఒకరి అభిప్రాయాలు ఇంకొకరి మీద రుద్దుకోవడం కాదు. అందరూ కలిసి ఒకదానిపట్ల అవగాహన పెంచుకోవడం. అది సత్సంగమవుతుంది తప్పితే, కూర్చొని డిస్కషన్స్ చేసుకోవడం, వాదోపవాదాలు పెంచుకోవడం కాదు. బాబానే చెప్తున్నారు అది, నేను చెప్పాల్సిన అవసరమేమీ లేదు. "వాదోపవాదాలతో పని లేదు. తర్కంతో, శాస్త్రషట్కంతో పని లేదు. వంతులకు, కీచులాటలకూ పోవద్దు". ఇవి బాబా సూక్తులున్నాయి. మీరు బాబా భక్తులంటున్నారు కనుక అవి ఫాలో చేయమని చెప్పు. ఇక్కడ నలుగురు

కూర్చొని చేసేది గ్రూప్ డిస్కషన్ కాదు. డిస్కషన్ అంటే ఎలాంటి డిస్కషన్? అందరం కలిసి



ఒక అవగాహనను పెంచుకుంటున్నాం. అభిప్రాయభేదాలేమీ లేవు. ఒకరికి ఎక్కువ తెలుసు. ఒకరికి తక్కువ తెలుసు. ఎక్కువ తెలిసినటువంటి వాడు తక్కువ తెలిసినవాడికి కాంప్లిమెంట్ చేస్తుంటాడు. వీడు వాణ్ణి కాంప్లిమెంట్ చేస్తుంటాడు. అందరూ కలిసి ఒకరినొకరు కాంప్లిమెంట్ చేసుకుంటూ పోతాం. అదీ 'సత్సంగం' అంటే. వాదనలు పెంచుకోవడంలో ఉపయోగమేమీ లేదు. **నేను చెప్తున్నాను కదా. ఏదైనా ఒక పాయింట్ నిజంగా ఎస్టాబ్లిష్ కావాలంటే మనం ఆచరించాలి. ఈ ఆచరణలో నుండి వచ్చేటువంటి బలం, శక్తి ఉన్నదే. అది వెయ్యి వాదనలకు మించినది.** ఎదుటివాడు సామాన్యంగా ఇటువంటివన్నీ ఎందుకు చేస్తుంటాడంటే, భయానికి. నేను మళ్ళీ చెప్తున్నాను కదా, భయానికే... ఈ జ్యోతిషాలు, ఈ వాస్తులు ఇవంతా ఏమిటంటే భయం, తర్వాత మన శక్తి మీదగాని, బాబా యొక్క శక్తి మీద గానీ నమ్మకం లేక... ఇంకా ఏవో కొన్ని శక్తులున్నాయి. ఈ ఎక్స్-ఫ్యాక్టర్స్ వల్ల మనం ఏదో లాభం పొందాలి, లేదా నష్టపడకుండా ఉండాలి అనే దానిమీద స్టార్ట్ అవుతాయి ఇవన్నీ కూడా. మనం ఎప్పుడైతే ఫాలో చేసి సరిగ్గా ఉంటున్నామో, ఎదుటివాడికి కూడా ధైర్యం కలుగుతుంది. ఏం కాలేదు కదా వీడికి అని. నేను వెంకటగిరిలోనో, అక్కడ ఉండేటపుడు నాకు ఇళ్ళు చాలా చీప్‌గా దొరికేవి, మహా డెడ్‌చీప్‌లో పెద్ద పెద్ద ప్యాలెస్‌లు దొరికేవి. ఎందుకనంటే అక్కడెవ్వరూ చేరేవాళ్ళు కాదు. దెయ్యాలకొంప అని. ఆ తరువాత నాకు ఇచ్చేవాళ్ళు. నేను వెళ్ళి చేరి, బ్రతికి బయటపడ్డాను కదా, ఏమీ లేదులే అనుకొని, ఆ తర్వాత నుండి మళ్ళీ వాటికి కళ పెరిగిపోతుంది, విపరీతంగా. ఇక అందరూ పెద్ద పెద్ద రెంట్లు ఇచ్చుకొని, రెంట్‌కి తీసుకునేవాళ్ళు. ముందు మన మీద ఎక్స్‌పెరిమెంట్ చేస్తారు. ఎక్స్‌పెరిమెంట్ చెయ్యడానికి మనం సిద్ధపడాలి. అట్లాగే ఇప్పుడు ఒంగోలులో మందిరం ప్లాన్ చేసారు. గోల గోల చేస్తున్నారందరూ అక్కడ. అసలు అదెట్లా కడుతున్నారు. ఆ రకంగాను? ఇంతకంటే అన్యాయం ఇంక ఎక్కడైనా ఉంటుందా? ఆ రకంగా కట్టడం? ఎవరైనా ఈశాన్యంలో కడతారా? మొత్తం ప్లాట్‌కి కంప్లీట్‌గా కొసన... ఇంత కూడా ఒక్క ఇంచ్ కూడా సైట్ ఇవ్వకుండా ఈశాన్యమూల కడ్తున్నాం మందిరం మనం. ఈశాన్యమూల అసలు కన్‌స్ట్రక్షన్ రావచ్చునా? బావికి మళ్ళీ ఇవతలవైపుకి కూడా వస్తోంది. అవతలవైపుకి కూడా కాదు. నైరుతిలో కాబోలు బావి ఉంది. అక్కడ ఆ రకంగా చూస్తే వాస్తుకి అంతకంటే విరుద్ధమైనటువంటి కన్‌స్ట్రక్షన్ ఇంకెక్కడా కనిపించదు, మన ఆంధ్రప్రదేశ్‌లోనే. కట్టమని చెప్పాను ఏం ఫరవాలేదు కట్టుకోవచ్చు, ఆ సైట్‌కి మళ్ళా అవతలవైపుకి కూడా కట్టుకోవచ్చు. నేను వాస్తుకి విరుద్ధంగా పోవాలని చెప్పలేదు, అక్కడ కట్టమని. నేనసలు



అది చెప్పేటపుడు ... ఒకసారి నా దగ్గరికి ప్లాన్ తీసుకొచ్చి ఎక్కడ కట్టమంటారనంటే, ఇక్కడ కట్టుకోండి అన్నాను. అది ఏవైపున? అది ఈశాన్యమా? అని నాకసలు ఆలోచన కూడా రాలేదు. నాకసలు ఈ వాస్తుపట్ల ఆలోచన పోదు, అది వేరే విషయం. ఎందుకు చెప్పానంటే అది, ఎవరైనా సరే టౌన్‌లో నుండి వచ్చేటపుడు బాబాను దాటుకొని స్కూల్‌కి రావాలి. అది నా సెంటిమెంట్, అంతే.

ముందు బాబా కనిపించాలి వాళ్ళకి. బాబా మందిరాన్ని దాటుకొని స్కూల్‌కి రావాలి. మన ఇంపార్టెన్స్ 'బాబా'. స్కూల్ కాదు. అట్లా రావాలనంటే అదే స్పాట్ అక్కడ. ఇక వేరే స్పాట్ లేదు. వాస్తుకోసం కట్టినట్లయితే ముందు స్కూల్, తర్వాత బాబా మందిరం అవుతుంది. **సెకెండ్ ప్రయారిటీ బాబాకిచ్చే క్వశ్చనే లేదు.ఫస్ట్ ప్రయారిటీ మనకు బాబానే కావాలి. ఆ ప్రిన్సిపుల్ నాకు ఇంపార్టెంట్.** స్కూల్ రాని, ఇంకొకటి రాని, ఇంకొకటి రాకపోనీ, దాని గురించి మనకేం ఇది లేదు. అందుకోసం చెప్పాను అక్కడ కట్టమని. టౌన్‌లో నుండి ఎంటర్ అయ్యేటపుడు మన సైట్‌లో, ఫస్ట్ అక్కడ స్టార్ట్ అవుతుంది. మొట్టమొదట బాబానే ఉండాలి. అందరం బాబాకు నమస్కారం చేసుకొని ఎంటర్ కావాలి. అంతకు మించి దాంట్లో ఇంక పరమార్థమేమీ లేదు. ఇదే పరమార్థం. ఆ తరువాత వీళ్ళు వచ్చి, "సార్, సార్! ఇట్లా అంటున్నారు. అట్లా అంటున్నారు" అన్నారు. ఓహో, అలా చేసానా నాకు తెలియకుండా సరే మంచిదే కదా, చేసుకోండి అని చెప్పాను. **బాబా దయవల్ల అట్లా వాస్తుకి విరుద్ధంగా వచ్చిందా? మంచిదే కదా. అలాగే కానివ్వండి...**

**భక్తుడు :** నానాసాహెబ్ చాందోర్కర్ బాబా దగ్గరకు వచ్చినపుడు, అంటే మనవడు చనిపోయిన తర్వాత అల్లుడు చనిపోయిన తర్వాత, ఆయన చాలాకాలం బాబా దగ్గరకు రారు కదండీ? వచ్చిన తరువాత బాబాగారు నువ్వు దీనికోసం నా దగ్గరకు రానక్కర్లేదని అంటారు కదా. బాబా అలా ఎందుకనాలి? అంటే నీ కర్మ నీవు అనుభవించాలి అని ఎందుకన్నారాయన? ఇవన్నీ చేసినవారు అది కూడా చేయవచ్చు కదా? అట్లా ఎందుకన్నారు అన్నది ఒకసారి సత్సంగంలో వచ్చింది.

**గురువుగారు :** మామూలుగానే ఓదార్చినట్టుగానే ఓదార్చారు. చాలా క్లోజ్‌గా ఉండేవాడాయన. కష్టంలో ఉన్నాడు. కష్టం నుండి వచ్చినటువంటి వాడికి ఏం చెప్తాం? మామూలుగా ఓదార్చినట్టుగానే ఓదార్చారు. అది నానాసాహెబ్ చాందోర్కర్‌కి తెలుసు. ఆ దిగులు కొంతకాలం ఉండింది ఆయనకు. వయస్సులో ఉండేటువంటి అమ్మాయికి ఇట్లా అయ్యింది కదా అని. కానీ ఎన్నో అనుభవాలున్నాయి ఆయనకు. ఎన్నోసార్లు ఆయన అనుకున్నట్లుగా బాబా మార్చిన సందర్భాలు... ఈసారి ఎందుకు



మార్చలేదో ఆయన. ఆయనకు చేతకాక కాదు. ఎందుకో చెయ్యలేదు. ఎందుకు చేయలేదో మనకు తెలియదు. ఆ అమ్మాయికి ఉండేటువంటి కనెక్షన్ ఏమిటో మనకు తెలియదు. దాని వెనుక... తర్వాత ఆయన మామూలుగానే అడ్జస్ట్ అయిపోయాడు. సహజంగా మామూలుగా మనకు కోపం ఉంటుంది కదా, బాబా నాకు ఎందుకు చేయలేదనేటువంటిది. మమకారం వల్ల వచ్చేటువంటిదది. అలా ఎందుకు జరిగిందనేదానికి వెయ్యి రీజన్స్ ఉంటాయి. ఆ వెయ్యి రీజన్స్ వాళ్ళకు చెప్తే అర్థమవుతుందా?

**– శ్రీబాబూజీ అనుగ్రహభాషణల నుండి**

# గురుకృపాలహరి

మానవజాతి మనుగడకు, ప్రగతికి ప్రకృతి నుండి సహాయ, సహకారాలు సదా అందుతూనే ఉంటాయి. అయితే ఆ ప్రగతికి రథచక్రాలైన వనరులను సద్వినియోగం చేసుకోకపోగా మరింతగా దుర్వినియోగం చేసుకుంటున్నాడు మనిషి. చిమ్మటి చీకట్లను తొలగించుకుని పక్షుల కిలకిలారావాలకు ప్రాణమై, అఖండ వెలుగులతో శక్తిని నింపుతూ ఆ నవ్యభానుని లేలేత కిరణాలు ఎలా అఖండ శక్తిని చేకూరుస్తాయో, ధర్మానికి గ్లాని కలిగి, మానవుని జీవనగమనం తిరోగమనదిశగా పయనించే సమయాన మహాత్ముని ఆగమనం సద్గురుభానునిగా అత్యవసరమౌతుంది. ఆ మహాత్ముని ఆగమనం గతి తప్పిన మతులకు మానవతా ఛాయలను గుర్తుచేయటమే కాక నిద్రాణమైన దైవీభావాలను 'మేలు'కొలుపుతుంది. కేవలం ఆ మహాత్ముని రూపమే ఆనందరసస్ఫోరకమై అంతులేని చింతలను బాపుతూ అనంతమైన ఆనందసంద్రపు అలలలో తేలియాడేటట్లు చేస్తుంది. ఛాందసభావాల చట్రాల ఇరుకులలో జనసామాన్యం ఉక్కిరిబిక్కిరయ్యే వేళ శాంతి, ఆనందాలను పంచే విజ్ఞాన వీచిక అవుతుంది మహాత్ముని వాణి. దైవమని కైమోడ్పులర్పించినా, అవతారమని ఆరాధించినా, గురువు అన్న భావనలో ఆ అడుగుల వెంట పయనించినా, తల్లీ, తండ్రీ అని అడుగడుగూ ఆదరువు కోరుకున్నా – "జయా మనీ జైసా భావ – తయా తైసా అనుభవ" ఎవరి భావాన్ననుసరించి వారికి అనుభవమిస్తూ అనుక్షణం కాచుకుంటూనే ఉంటుంది సంతపథం, సద్గురుపథం... ఒక్కోసారి మహాత్ముని ఆచరణాపథంలోని విస్తృత భావాన్ని జనసామాన్యం అవగతం చేసుకోలేరు. సత్యమే పథమైన ఆ గురుచంద్రుడు భావజాలాల చట్రాలలో ఇరుక్కుపోయిన మానవాళి అడుగులను మరోసారి సరి'దిద్ద'వలసి వస్తుంది. అలాంటి వారిలో ఈ శతాబ్దంలో గుర్తుకు వచ్చే అతి సాధారణ సన్యాసి –

అత్యంత ప్రభావశీల జగద్గురు స్వరూపి పూజ్యశ్రీ చంద్రశేఖర సరస్వతీ స్వామి.



**“యద్య దాచరతి శ్రేష్ఠ స్తత్త దేవేతరో జనః**
**స యత్ర్పమాణం కురుతే లోక స్తదనువర్తతే”.** శ్రేష్ఠులైన వారు చేసే పనులను సామాన్య జనులు అనుకరిస్తారు. వారు నెలకొల్పిన ప్రమాణాన్నే, ప్రపంచమంతా అనుసరిస్తారని అంటాడు గీతాచార్యుడు. పాశ్చాత్య భావజాలాన్ని, నవీన పోకడలను అనుకరించే క్రమంలో భగవంతుని ఉనికిని మరిచిపోతున్న జాతికోసం గ్రామాలు, పట్టణాలు, అడవులు, వనాలు బేధం లేకుండా ప్రతీచోటునూ తమ చరణ స్పర్శతో పావనం చేసి జనసామాన్యపు సందేహాలను తీర్చారు స్వామి. త్రికాల పూజను ఒక్కపూట కూడా మానకుండా సాగించారు. గ్రామలలో పూరిగుడిసెలలో జీవించారు. చిన్నారులతో రామకోటి రాయించారు. ప్రజలకు పొదుపు నేర్పి పిడికెడు బియ్యం ప్రతిరోజూ ప్రోగుచేయించి పాడుబడ్డ గుళ్ళలో అన్నదానం చేయించారు. విదేశీయులను ఈసడించుకోక విజ్ఞాన గనియైన భారత ఆధ్యాత్మిక సారస్వతాన్ని గంగాజలంగా వారికీ అందించారు. వికేశిని అయిన (కేశములు లేని) విధవరాలు వస్తే మహాపండితులకన్నా ముందు స్వయంగా తీర్థమిచ్చారు. వాడవాడల్లో ఉచిత వైద్యకేంద్రాలు పెట్టించి కుల, మత, జాతి బేధాలకతీతంగా ప్రతి మనిషికి, కుటుంబానికి సాయం చేశారు.

పూజ్య పరమాచార్యస్వామి తమ దశాబ్దకాల పూర్తి ఏకాంతం నుండి శివస్థానం విడిచి ఏప్రిల్ 15వ తేదీ, 1978వ సం॥ మరల తమ పాదయాత్రతో ఎన్నో ప్రాంతాలను పావనం చేశారు. ఆనాటికి వారికి 84 సంవత్సరాలు. తమిళ నూతన సంవత్సరంనాడు తెల్లవారుఝామున మూడుగంటల సమయంలో పది సంవత్సరాలు తమకు ఆవాసమైన బ్రహ్మపురీశ్వర ఆలయాన్ని విడిచి వరదరాజస్వామి ఆలయంలో భక్తులు విష్ణు సహస్రనామం పఠిస్తుండగా విచ్చేసిన స్వామివారు, కామాక్షిని దర్శించి, మఠంలో శంకరులను సేవించి కేవలం ఐదుగురు భక్తులతో పాదయాత్ర ప్రారంభించారు. సూచనా మాత్రంగానైనా వారు మరల పాదచారియై తమ యాత్రను ప్రారంభిస్తారని ఎవ్వరికీ సమాచారం లేదు. జనుల అజ్ఞానాంధకారాలను(గు) తొలగించడానికి(రు) గురుస్వరూపం అవనికి విచ్చేసే సమయంలో ఆచార్య దేవులను అర్చించుకోవడం, ఆ బాటన నడవడం జాతి కర్తవ్యమని గుర్తించాలి. భక్తులను ఉద్ధరించడానికి శ్రీసాయి అవతరించారని శ్రీసాయి ఆరతి గీతాలు

కీర్తిస్తే, తన భక్తుల ఉద్ధరణకై వేలసార్లు రూపం ధరిస్తానన్న శ్రీరామకృష్ణుల వాణిని కూడా ఈ



జాతి మరువరాదు. మహాత్ముని అవతారకార్య నిర్వహణకు వారి శరీరం కేవలం ఒక ఉపాధి మాత్రమేనని, ఋణానుబంధంతో ఆయా జీవుల ఉద్ధరణకై తమ శరీరధర్మాన్ని కూడా లెక్కచేయక ఆశ్రితులను ఉద్ధరించ వారి అడుగులు సాగుతాయని అర్థం చేసుకోవాలి. గౌరవనీయ తెలుగుకవి శ్రీసీతారామశాస్త్రిగారు “తరలిరాద తనే వసంతం...తన దరికిరాని వనాల కోసం” అన్నట్లు అనుగ్రహ వసంతం – అందరి కోసం, అందుకోలేని వారికోసం, జనుల జన్మలు చరితార్థం చేయడం కోసం వారి లోగిళ్ళలోకే తరలి వచ్చింది. ఆరువందల కిలోమీటర్లు నడిచి బళ్ళారికి దగ్గరలో ఉన్న హగరి చేరారు స్వామి. అక్కడే చాతుర్మాస్యవ్రతం జరిగింది. చాతుర్మాస్యం పూర్తయ్యాక సండూరుకు దగ్గర్లో ఉన్న సమయంలో అప్పటి ప్రధాని మొరార్జీదేశాయి స్వామివారి దర్శనం చేసుకోవడం, సుమారు ఇరవై నిమిషాలు స్వామివారితో సంభాషించడం జరిగింది. రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి తమ కుటుంబ సమేతంగా సండూరు వచ్చి పరమాచార్యవారి దర్శనం చేసుకున్నారు. సండూర్ మహారాజుగారి విన్నపాన్ని ఆశీర్వదిస్తూ స్వామివారు ఇరవైమూడురోజులు ఉండటం, అక్కడి జనసామాన్యాన్ని దీవించడమూ జరిగాయి. 1979వ సం॥ స్వామివారు కొన్ని నెలలు బెల్గాంలో విడిది చేశారు. బెల్గాంలో స్వామి విడిది సమయంలో స్పానిష్ రాజకుటుంబ రాణులు మరియు పద్దెనిమిది మంది పరివారం స్వామివారి ఆశీస్సులను, సందేశాన్ని పొంది ఆనందభరితులయ్యారు. అక్కడి గురుదేవ మందిరంలో చాతుర్మాస్య వ్రతం జరిగింది. 1980వ సం॥ ఫిబ్రవరిలో వారి గురుదేవులు, పరమ గురువుల ఆరాధనా సమయంలో ఉగర్‌లో 82 రోజులు విడిది చేశారు. వారు ఉగర్ గ్రామాన్ని విడిచిపెట్టే సమయంలో వారి దివ్యసన్నిధిని విడిచిపెట్టలేని ఆ ఊరి ప్రజలు ఎంతో దుఃఖానికి లోనయ్యారు. అక్కడి నుండి తమిళ నూతన సంవత్సరాన్ని మీరాజ్‌లో జరుపుకున్నారు. జూన్ 23వ తేదీ 1980వ సం॥ మహారాష్ట్రలోని సతారా చేరుకున్నారు. స్వామివారి సంవత్సరకాల విడిది సతారా వాసులకే కాక స్వామివారి భక్తజనులెందరికో మధురానుభూతులను పంచింది. అధికార, అనధికారులేనా, ఎక్కడెక్కడినుండో భక్తులేనా, ఎందరో స్వామివారి దర్శనం కోసం సతారా వేంచేశారు. ఎంతో మంది భక్తజనులు అక్కడే కొన్నిరోజులు ఉండిపోయి స్వామివారి సన్నిధిని అనుక్షణం అనుభూతిప్రదం చేసుకున్నారు. సతారాలో స్వామివారిని దర్శించి భక్త శరణాగతుడైన హోటల్ యజమాని శ్రీసామన్న, మఠానికి పెద్దమొత్తంలో ద్రవ్యాన్ని దక్షిణగా సమర్పిస్తానని వేడుకున్నాడు. ఎన్నోసార్లు స్వామివారు నిరాకరించినా సామన్న మాత్రం తన విన్నపాన్ని



విరమించుకోకపోవడంతో కరుణాళువైన స్వామివారు ఒకనాడు "ఈ ధనంతో నువ్వు ఇక్కడ ఒక శివాలయాన్ని నిర్మించు" అని ఆదేశించారు. ఎలాంటి ఆలయాన్ని నిర్మించాలో సందిగ్ధంలో ఉన్న సామన్నను, ధర్మపత్నీ సమేతంగా చిదంబరం ఆలయాన్ని దర్శించుకురమ్మని మఠ పరిచారకుడిని పురమాయించి, దగ్గరుండి మరీ ఆ ఆలయాన్ని, దాని విశిష్టతను తెలియజెప్పమని పంపారు స్వామి. ఆ దంపతులు చిదంబరం వెళ్ళి ఆలయాలన్నింటిని దర్శించి తిరిగివచ్చారు సతారాకు. "చిదంబర నటరాజ ఆలయానికి నమూనాగా చిన్న ఆలయాన్ని ఇక్కడ నిర్మించు" అని సెలవిచ్చారు స్వామి. అంతేకాదు ఏ ప్రాంతమైతే ఆలయం కోసంగా నిర్దేశించబడిందో అక్కడ స్వామివారు కొంతసేపు ధ్యానస్థులై వేంచేయడంతో స్థలశుద్ధి కూడా జరిగింది. రామేశ్వర శంకరమఠాన్ని, కాలడిలో శంకర కీర్తిస్తంభాన్ని నిర్మించిన బాణంపట్టు కన్నన్‌కు ఆలయ నిర్మాణ బాధ్యతను అప్పగించడం జరిగింది. విశేషమేమంటే స్వామివారి ఈ దివ్య సంకల్పంతో మూడు దక్షిణాది రాష్ట్రప్రభుత్వాలు మూడు గోపురాలను నిర్మించడానికి ముందుకొస్తే కేరళ ప్రభుత్వం కలపను ఏర్పాటుచేసి ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టారు. మూడు సంవత్సరాలు పట్టిన ఆలయ నిర్మాణ సమయంలో శ్రీసామన్న పరమపదించాడు. వారి కుమారుడు ఎంతో బాధ్యతతో ఆ ఆలయ నిర్మాణాన్ని స్వామివారి అనుగ్రహంతో పూర్తి చేయడమూ, శ్రీజయేంద్ర సరస్వతీస్వామివారు జూన్ 9వ తేదీ, 1985వ సం॥ ప్రతిష్ఠాపనా కార్యం నిర్వహించడమూ జరిగాయి. ఈనాటికీ ఉత్తర చిదంబరంగా ఈ ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచింది.

1981వ సం॥ జూన్ నెలలో చాతుర్మాస్యం మహారాష్ట్రలోని పండరీపురంలో జరిగింది. చంద్రభాగానదిలో స్నానమాచరించి మహాస్వామివారు మధ్వవేదపాఠశాలలో విడిది చేశారు. అది రెండు దశాబ్దాల పూర్వం మూతపడిన వేదపాఠశాల. అక్కడే స్వామివారు వారి చాతుర్మాస్యాన్ని ఆచరించ సంకల్పించారు. ఆ పాఠశాలను ఆనుకుని ఉన్న ఒక చిన్న బిల్డింగ్‌ను సండూర్ మహారాజు మరమ్మత్తులు చేయించారు అంతేవాసుల కోసం. పండరీ విఠలుని, రుక్మాబాయిని, త్రయంబకేశ్వరుని సేవించిన స్వామివారు 162 రోజుల పండరీ విడిది తరువాత షోలాపూర్, తుల్జాపూర్ చేరి తుల్జాభవానీని దర్శించుకున్నారు. గోదావరీ తీరంలో దేవభూమిగా పిలువబడే ఆలయాలైన నృశింహుని ఆలయం, గోదావరి నది మధ్యలో ఈనాటికీ ఎన్నో వరదలను, అత్యధిక నీటి ప్రవాహాన్ని కూడా తట్టుకుంటూ చెక్కుచెదరకుండా నిలబడిన ముద్గలేశ్వరుని ఆలయాన్ని దర్శించారు. 1982వ



సం॥ చాతుర్మాస్య వ్రతానికి మాణిక్యరావు మహరాజ్ మఠం వేదికయ్యింది. శ్రీయుతులు రాజీవ్‌గాంధీ స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులనందుకున్నారు ఈ ప్రాంగణంలో. మహగం నుండి స్వామివారు పయనమవ్వడానికి అక్కడి భక్తజనులు అస్సలు ఒప్పుకోలేదు. వారిని ఒప్పించి మొత్తానికి సాయం సమయానికి బయలుదేరారు స్వామి. చిన్న చిన్న గ్రామాల వెంట పాదచారియై ప్రతీ గ్రామాన్ని తమ చరణస్పర్శతో దీవిస్తూ స్వామివారు, కర్ణాటక – ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన కస్తూరిపల్లి, రాఘవేంద్ర సిమెంటు ఫ్యాక్టరీలో విడిది చేశారు.

ఇలా వారి 84వ సంవత్సరంలో ప్రారంభమయిన ఈ యాత్ర ఎంతో విశిష్టతను సంతరించుకుంది. వారి శ్రేష్ఠ వయస్సు వారిని ఏ మాత్రం కట్టడి చేయలేకపోయింది. ఆరోగ్యం క్షీణిస్తున్న ఏ దశలోనూ వారి నిరాహార నియమంగానీ, మౌనంలో అధిక సమయం గడపడం, ఎంతో కఠినమైన రాతితో, గుట్టలతో కూడుకున్న ప్రాంతాలలో సంచరించడంగానీ, ఒక్కరోజూ మారలేదంటే అతిశయోక్తి కాదు. ఇక్కడ ఒక్క విషయం చాలా గమనార్హమైనది. ఈ ఆరు సంవత్సరాల యాత్ర స్వామివారు మఠ పీఠాధిపతిగా కాక ఒక సామాన్య సన్యాసిగా, ఎటువంటి మఠ గౌరవ మర్యాదలు లేకుండా, ప్రభుత్వ లాంఛనాలకు దూరంగా అతి తక్కువమంది అంతేవాసుల సహకారంతో చేయడం, ఎక్కడా ఏ వేడుకకు అవకాశమివ్వకపోవడం. 1968వ సం॥లో శ్రీజయేంద్ర సరస్వతీస్వామి వారిని పీఠాధిపతిగా నియమించాక స్వామివారు మెల్లమెల్లగా బాధ్యతపరంగా వచ్చిన పీఠ గౌరవ మర్యాదల చట్రం నుండి కూడా విడుదలవుతూ ఇంకా ఇంకా తపోధనులై పూర్తిగా దైవంలో లీనమవుతూ వచ్చారు. స్వామివారు ఎక్కడ ఉన్నా శ్రీజయేంద్ర సరస్వతీ స్వామివారు వారి గురువుగారిని దర్శిస్తూ వారి సూచనల మేరకు నడుచుకునేవారు. ఒక నిజమైన సన్యాసి ఎలా జీవించాలో తెలియజేసే వారి ఆచరణే వేదాలకు ఆధారం. వేదం చెప్పినట్లు వారు నడుచుకున్నారన్నది జన సామాన్యపు విజ్ఞుల వాణి. శరీరము, మనస్సు, ప్రతికూల పరిస్థితులు వేటికీ వెరవని – దైవదత్తంగా ఎదురయ్యే ప్రతీ పరిస్థితిని ప్రసాదంగా స్వీకరించి, సర్వజీవులలోనూ భగవంతుని దర్శించే వారి జీవితమే “నిజమైన సన్యాసి”కి పరిపూర్ణ స్వరూపం. 85 సంవత్సరాల వయసులో వారి పాదయాత్రకు వారు స్వీకరించిన ఒకే ఒక్క సౌకర్యం ఏమిటంటే ఒక రిక్షా. ఇద్దరు భక్తులు నెడుతుండగా వారు ఆ రిక్షాను ఒక ఆధారంగా పట్టుకుని నడిచేవారు. ఆరు వసంతాల తరువాత 1984వ సం॥లో స్వామివారు కంచి మఠ ప్రాంగణానికి వేంచేసిన సమయంలో ఆ రిక్షా దుర్బలంగా మారి విరిగిపోయిందని



చెపుతుంటారు. వారు వాడిన మేనాతోపాటు ఆ రిక్షా కూడా నాటి నుండి ఒక స్మారక చిహ్నంగానే ఉండి పోయింది.

వారికి ఎనభై వసంతాలు పూర్తి అయ్యాక, దశాబ్దికాలం మౌనంలో గడిపి సురేశ్వరాచార్యుల సన్నిధిలో మౌనం విడిచి మరల భక్తజన మనోఫలకాలలో మరోసారి అనుభూతి చిత్రాలను ముద్రించడానికి పయనమయ్యాక ఎన్ని అనుభవాలో, మరెన్ని లీలా విశేషాలో, నవ్వులు పూయించే సంఘటనలో, కళ్ళు చెమర్చే ప్రేమానుభూతుల 'పల్లవులో', మనసు పరవశించే ఆనంద 'చరణాలో', సదా భగవత్ సాక్షాత్కారంగా కన్పించే అనుగ్రహ ముద్రల 'నేపథ్య సంగీతమో'. ఏంటో అవి చూద్దాం రండి. ఈ సారి (పై) యాత్రకు స్వామివారు మఠ పరివారాన్ని వద్దనడమే కాక ఎటువంటి పీఠ మర్యాదను స్వీకరించలేదని పైన చెప్పుకున్న విషయం. కేవలం ఐదుగురు అంతేవాసులు, వారిలో బ్రహ్మచారిగా (వివాహం కాని) ఉన్నవారినే అనుమతించారు. వారిలో 'బాలు' అనే గృహస్థు తానూ వస్తానని ఆర్తిగా అర్థిస్తే బాలు శ్రీమతిని, పిల్లలను పిలిచి వారితో మాట్లాడిన తరువాతనే తాను రావడానికి అనుమతించారు. అంతేకాదు పండుగ సమయాల్లో వెళ్ళి కుటుంబంతో ఉండి మరల యాత్రలో చేరతానంటేనే 'బాలు'కు అనుమతి, వారి నిత్య సేవకు సమ్మతి. ఏ మర్యాదా లేకుండా సాగే ఆ యాత్రలో పరిహాసంగా 'ఏకాంబరానికి' మఠ మేనేజరు పదవి. వారి బాధ్యత ఏమంటే ముందు వెళుతూ నీటిచెలమలు, కాల్వలు ఉండే ప్రాంతాన్ని స్వామివారి విడిదికై ముందుగానే నిర్ణయించడం. ఎందరో భూస్వాములు, ధనవంతులు, పారిశ్రామికవేత్తలు, రాజులు, అధికారులు స్వామివారి విడిది ఏర్పాటుకై ముందుకొచ్చేవారు. కానీ వారితో ఉన్న ఆ ఐదుగురు అంతేవాసుల కనీస అవసరాలు తప్ప స్వామివారు మాత్రం శిథిలమైన ఇళ్ళు, ఆలయాలు, పొలంగట్లు, వర్షఛాయలు లేకపోతే చెట్టుక్రిందనే ఆవాసం ఉండేవారు. స్వామివారి వైభవం తెలిసిన గ్రామాలు మంగళ ఆరతులు పట్టి దీవెనలందుకునేవి. మరోవంక ఆడంబరమైన సన్యాసి స్వామివారికి త్రోవలో ఎదురుపడి, "మీకు తోటకాష్టకం తెలుసా?" అని అడిగి వారు సమాధానం చెప్పేలోపే "నేను పఠిస్తాను, విను" అంటే స్వామివారు శ్రద్ధగా వినడమే కాదు, ప్రతీ శ్లోకానికి దండంతో సహా వందనాలర్పించిన సందర్భం స్వామివారి సహజ వినమ్రతను, మనలాంటి వారు నిత్యజీవితంలో ఎలా చరించాలో తెలియచెపుతుంది. శ్రీఏకాంబరం ఇలా చెపుతారు, "మనం ప్రతీ పరిస్థితికి సిద్ధంగా ఉండాలి.

స్వామివారితో కలిసి కర్ణాటక రాష్ట్రంలోని మారుమూల పల్లెలో యాత్ర చేస్తున్నప్పుడు శిథిలమైన



ఒక పాత షెడ్డు ఎదురుపడితే ఆ రోజు అక్కడ బస చేద్దామనుకున్నాం. కానీ అక్కడి కార్మికులు అందుకు అనుమతించలేదు. అక్కడ ఉన్న ఒక పంపు షెడ్డులో ఉండమంటే అది ఇంకా దుర్భరంగా ఉండటంతో స్వామివారిని రోడ్డుమీద కూర్చొనబెట్టవలసివచ్చింది. మా అందరి కళ్ళలో నీళ్ళు ఆపుకోలేకపోయాం. వారు మాత్రం ఎక్కడైనా మహారాజే! మరికొంత దూరం వెళ్ళి వారి అనుష్ఠానానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నాం.

స్వామివారి యాత్రను ఏదో ఒక విధంగా గమనించుకునే భక్తులు మాత్రం మధ్యమధ్యలో వారిని దర్శించి ఆనందతన్మయులయ్యేవారు. సాధారణ ప్రజ, దేశాధినేత ఇద్దరూ వారి దృష్టిలో ఒక్కటే. నాటి నాయకుల తీరు కూడా అలాగే ఉండేది. శ్రీమతి ఇందిరాగాంధీ, మొరార్జీదేశాయ్, నీలం సంజీవరెడ్డి ఇలా ఎందరో. అతిసాధారణమైన, శిథిలావస్థకు చేరిన ఆలయాలు, మారుమూల పల్లెల్లోనే వారిని దర్శించి ఆశీస్సులందుకున్నారు. పర్వదినాలైన శంకరజయంతి, వ్యాసపూజ వంటివి కూడా పీఠంలోనే జరగాలన్న వారి ఆనతితో, కేవలం అతి తక్కువ మంది భక్తులతో వారి సన్నిధిలో నిరాడంబరంగా జరిగేవి. కనీసం వారి జయంతికి విశేషపూజలు, అభిషేకాలు చేయడానికి వారి అనుమతి పొందడం అంతేవాసులకు అతి కష్టమయ్యేది. కొన్ని సందర్భాలలో పాడుబడిన ఆలయాలలో, నివాసయోగ్యంగాక వదిలేసిన గృహాలలో వారు తపోమగ్నులయిన వేళ కేవలం కిటికీ నుండే వారికి ఆహారాన్ని అందించవలసి వచ్చేది. ఒకనాడు ఒక పెద్ద నల్ల కొండచిలువ స్వామివారి చెంతకు చేరి కొంతసేపు స్వామివారిని దర్శించి ఎటువంటి ఆటంకమూ లేకుండా వెళ్ళిపోవడం చూసి ఈశ్వరుని కోసం వచ్చిన వాసుకిలా భావించి నమస్కారం చేసుకున్నారు అంతేవాసులు.

ఉత్తర చిదంబరం ఆలయం నిర్మాణం పూర్తి అయ్యాక అక్కడి విగ్రహ ప్రతిష్ఠకై స్వామివారి నుంచి ఒక ఆదేశం అందింది. నటరాజ, శివకామి, సుబ్రహ్మణ్యేశ్వర విగ్రహాలను స్వామివారున్న చోటకు తీసుకురావాలని ఆదేశించారు శ్రీవైద్యనాథన్‌కు. ఇది స్వామివారి సహజ వైఖరికి విరుద్ధం. కానీ ఎంతో భక్తి ప్రపత్తులతో ఆ ఆలయం నిర్మాణం మొదలుపెట్టిన శ్రీసామన్న ప్రేమకు స్వామివారి అతిశీతల ఆశీస్సులు మాత్రమే అవి. సామన్న ఆత్మ ఎంతగా సంతోషించిందో కదా! శ్రీవారి ప్రథమ పూజతో. స్వామివారి దివ్యహస్తాలతో ప్రథమ పూజలందుకున్నాక ఆ రూపాలకు ప్రాణప్రతిష్ఠ జరిగింది.

**భక్తుల ప్రేమ'పాలు' – గురువు అనుగ్రహంతో కలిసి 'చిక్క'బడతాయి. ఎదురయ్యే ప్రతీ సంఘటనను సద్గురు ప్రసాదంగా స్వీకరిస్తే, శ్రద్ధా, సబూరీలతో నిలిస్తే అమృతఘృతం (నెయ్యి) లభిస్తుంది.**



**దేహంతో చేసే జీవితమనే 'యజ్ఞం'లో ఆ ఘృతమే భగవంతుని ఒడికి చేరుస్తుంది. గురువుది షరతులు లేని ప్రేమ. సచ్ఛిష్యునికి ఉండవలసింది సర్వకాల, సర్వావస్థలలో గురువు ఉన్నాడన్న ధీమా! అపారమైన గురుకరుణకు ఇవిగో మరికొన్ని అమృతానుభవాలు.**

కర్ణాటక గుల్బర్గా ప్రాంతంలో యాత్ర జరిగే సమయంలో ఒకనాడు అతిపెద్ద వర్షంలో స్వామివారు, అంతేవాసులు చిక్కుకుపోయారు. ఇక ఆ కుంభవృష్టికి ఉదయమే అయినా చిక్కటి చీకటిగా మారింది వాతావరణం. రిక్షా పట్టుకు నడిచే స్వామివారికి ఒక ప్లాస్టిక్ పట్టా ఆచ్ఛాదనగా పట్టుకుని నడుస్తున్నారు అంతేవాసులు. స్వామివారు మాత్రం అప్పుడప్పుడు ఆ ఆచ్ఛాదన నుండి బయటకు వచ్చి తడుస్తూ ఏం జరుగుతుందో గమనిస్తున్నారు. చివరకు ఒక శిథిల దేవాలయం చేరి సేద తీరుతున్న సమయంలో ఏకాంబరం స్వామివారిని అడిగాడు వారు ఎందుకు అలా చేశారని. వారన్నారు, "వడగళ్ళతో విరుచుకుపడుతున్న ఆ వైపరీత్యంలో మీకు ఏమైనా అయితే మిమ్మల్ని కోల్పోయి నేను జీవించలేను అని." భక్తులది బంధం. గురువుది జన్మజన్మల ఋణ కరుణానుబంధం. సకల చరాచరజీవుల శ్రేయస్సును అనుక్షణమూ, అణువణువూ ఆకాంక్షించే అమృతత్వమే నిజమైన సన్యాసితత్త్వం. అందుకేనేమో శ్రీదలైలామా స్వామివారిని "ఈ శతాబ్దపు నిజమైన సన్యాసి" అని కొనియాడింది. యాత్రలో సండూర్ మహారాజు స్వామివారిని దర్శించుకున్నారు. ఆ రాజుగారిని స్వామివారు ఒక సహాయం అడిగారు. అది ఏమంటే స్వామివారితో యాత్ర చేస్తున్న ఆ ఐదుగురు అంతేవాసులకు పాదరక్షలు(చెప్పులు) ఏర్పాటు చేయమని. స్వామివారితో యాత్రలో పాదరక్షలు ధరించడం ఆ అంతేవాసులకు ససేమిరా ఇష్టంలేదు. నడయాడే దైవానికి అపచారమని వారి భావం. మీరు పాదరక్షలు ధరించకపోతే ఒక్క అడుగూ నేను వేయనని స్వామివారి ఆదేశం. అవకాశం లేదని అర్థమయిన అంతేవాసులకు పాదరక్షలు ధరించక తప్పింది కాదు. **బిడ్డల కాళ్ళలో గుచ్చుకునే ముళ్ళు – మాతృమూర్తి అయిన గురుదేవుని మనసుకు అయ్యే గాయాలు. శారీరకంగా అయ్యే గాయానికే గురువు కలత పడితే, ధర్మం వదిలి, ఆచరణకు నోచుకోని మన ప్రవర్తనను చూసి వారి మనసు ఎంత బాధపడుతుందో కదా!**

**"మనుష్యత్వం, ముముక్షత్వం, మహాపురుష సంశ్రయం" ఇవి మూడు లభించడం దుర్లభమంటారు పెద్దలు. మహాపురుష సంశ్రయం లభించాక కూడా మనుష్యత్వానికి, ముముక్షత్వానికి(భగవంతుని పొందాలన్న ఆర్తి) మెరుగులు దిద్దుకోకపోతే ఒక్క అడుగు అయినా పడేదెట్లా! గురుచంద్రుని**



మనం చేరేదెట్లా? ఈ విజయదశమి గురువుకు దూరం చేసే మనలోని అసుర భావాలనన్నింటిని దూరం చేసి, కుండపోతగా వర్షించే సద్గురు అనుగ్రహానికి మనం 'అహమనే' గొడుగును అడ్డుపెట్టుకోకుండా, ఆ 'ఆనందస్వరూపుని' స్మరణలో అనుక్షణం గడపాలని ఆశిస్తూ వచ్చే సంచికలో మరిన్ని సద్గురు పదముద్రలను దర్శించుకుందాం. సర్వులకు సద్గురు స్మరణ, గురుచరణ సంసేవన కలగాలని ఆశిస్తూ...... శుభం భవతు....

\- గురుకృప




సుందరరామశాస్త్రిగారిది సదాచార కుటుంబం. వారి తండ్రి, తాతల తరాల్లో నిప్పులు
ఇతరులు ముట్టుకుంటే అవి కూడా కడిగే ఆచారవంతులు ఆ కుటుంబీకులు.
మారుతున్న సమాజ పోకడలకు ఆ కుటుంబం అంతగా మారింది కూడా లేదు.
బయట వారితో కలిసి భోజనం చేయడం కూడా
ఆ కుటుంబ సభ్యులకు తెలియదంటే అతిశయోక్తి లేదు.
'సాయిపూజా మహోత్సవాల'ను పురస్కరించుకుని శ్రీబాబూజీ వారి ఊరు రావడం,
అక్కడ ఉత్సవ సమయంలో వారి గురించి తెలుసుకుని, అనతికాలంలోనే శ్రీబాబూజీతో
ఒక మధురానుబంధం ఏర్పడిపోయింది ఆ కుటుంబం మొత్తానికి.
'ప్రేమ'నుంచి జనించే
పరిణామం ఎప్పుడూ పూర్ణంగానే ఉంటుంది.
ఆ 'కుటుంబం' ఇక ఎవ్వరినీ 'వేరు'గా చూడలేదు.
ఇప్పటికీ వారు 'సదాచారులే'. 'సద్గురువు' చెప్పిందే వారికి ఆచారం.
'సద్గురువే' వారి ఆధారం.



# ప్రేమ సృష్టి... సాయి దృష్టి

"నన్ను ఆనంద స్వరూపునిగా ధ్యానించు! అది సాధ్యపడకపోతే నా యీ రూపాన్ని ధ్యానించు" అన్నది శ్రీసాయి ఉపదేశం. నిజానికి శ్రీసాయి తెలియచెప్పింది 'మన' స్వరూపం గురించే. ఆనంద స్వరూపంగానే మనిషి జన్మిస్తాడు, "ఉన్నదేదో తెలుసుకుంటే 'నేనే' నీవన్నావు నీవు" అన్న శ్రీబాబూజీ మాటల అంతరార్థం అదే. మరి ఆ ఆనందస్వరూపానికి మనకున్న ఆలంబనో! అది మహితాత్మకమైన శ్రీసాయి రూపం. "నా మట్టి మాట్లాడుతుంది, నా సమాధి సమాధానమిస్తుంది" అని శ్రీసాయి చెప్పిన శిరిడీ నేల, ఈనాటికీ సాయి భక్తులకు నిత్య సమాధానమై, సత్య సన్నిధానమై అలరారుతున్న మంగళధామము, ఆర్తత్రాణ పరాయణులకు మనో విశ్రాంతి స్థానము–శిరిడీ సాయినాథుని సమాధి మందిరము. అందు కొలువైన సద్గురుసామ్రాట్టు శ్రీసాయి యొక్క మహితాత్మకమైన, మనోల్లాసిత చందనచర్చిత రూపము, అపురూపము, మంగళ స్వరూపము. శ్రీసాయినే తమ సర్వస్వంగా భావించే శరణాగతులు ఈనాడు ఆ రూపానికి ఎంతగా పెనవేసుకు పోయారంటే ఆ సన్నిధి చేరేవరకు ఎన్నో ప్రశ్నలు, ఎన్నో కోర్కెలు, మరెన్నో ఆలోచనలు, ఇంకెన్నో వినతులు. కానీ ఆ సమ్మోహన స్వరూపుని శుభరూపాన్ని దర్శించాక ఇక అన్ని ఆలోచనలు ఎలా అంతర్ధానమయ్యాయో అంతుచిక్కని ప్రశ్నే. శ్రీసాయి రూపాన్ని దర్శించే ఆ క్షణాలు అలౌకిక ఆనంద స్వేచ్ఛ పవనాలు, అంతర్యామితో లీనమై, అన్ని ప్రశ్నలకు సమాధానం లభించిన పారలౌకిక పరమార్థాలు.. తనువు మరచి, తనను మరచి, జగత్తంతా సాయిమయమై, తాను శ్రీసాయిలో లయమై, నిజమైన 'ఆనంద'పు అనుభూతిని మనసంతా పొదుగుకొనే అమృతక్షణాలు. ఆ మంగళస్వరూపంతో సాయిభక్తుల బంధాన్ని ఎలా పంచుకుంటే అణుమాత్రం అక్షరరూపం ధరిస్తుంది. ఎన్ని కవన కుసుమాలు సమర్పించుకుంటే మనసు స్థిమిత పడుతుంది? భక్తజనుల మనో సీమలకు ఏకఛత్రాధిపత్యం వహించి, అనుక్షణం కాచుకుంటున్న శ్రీసాయినాథుని మంగళమూర్తి (విగ్రహం)తో మధుర స్మృతులను మరోసారి గుర్తు చేసుకుందామా?

భక్తుల మనోకామనలెరిగి, భక్తుల సంకల్పపు మూలాలకు ఆవల నిలిచే సాయినాథుని ప్రతీ తలపుకు ప్రతిరూపమే మనం చూసిన లీలావినోదాల సమాహారం. 1914వ సం॥లోనే శ్రీమతి జోగ్‌కు మసీదు ప్రక్కనున్న జాగాను చూపిస్తూ "ఇది నా స్థలం, ఇక్కడ ఒక గొప్ప సౌధం



నిర్మింపబడుతుంది, మేము దానిలో నివసిస్తాము, పెద్ద మనుషులు నన్ను చూసుకుంటారు" అని సెలవిచ్చారు సాయి. అంతేకాదు ఆ స్థలాన్ని శ్రీసాయి చదును చేసి అక్కడ ఒక ఉద్యానవనాన్ని తీర్చిదిద్దారు. బంతి, మల్లె వంటి పూల మొక్కలను పెంచే క్రమంలో శ్రీసాయి స్వయంగా నారువేసి, నీరు పోసేవారు. తామే కుండలతో నీరు తెచ్చేవారు ఆ ఉద్యానవనాన్ని తీర్చిదిద్దే క్రమంలో. హిందూ, ముస్లిం మతభేదం లేకుండా ఆకులను, పువ్వులను కూడా ఆలయ, మసీదులకు ఉచితంగా పంపేవారు. శ్రీసాయి చదును చేసింది ఎగుడు, దిగుడుగా ఉన్న మన మనోభూములనే కాదా! పోసిన ఆ నీరు సుసంపన్న సద్గుణజలమే కదా! పచ్చి కుండలు స్థిరపడని మన మనసులే కదా!

శ్రీమంతుడైన బూటీకి, షామాకు దీక్షిత్‌వాడాలో నిద్రిస్తుండగా ఒకే రకమైన కల రావడము, ఆ కలలో "ఆలయంతో కూడిన భవనాన్ని నిర్మించు, అక్కడ ఉండి మీ అందరి అభీష్టాలను నేను నెరవేరుస్తాను" అన్న శ్రీసాయి వాక్కును ఇరువురూ పంచుకోవడమూ జరిగాయి. సుస్థిరంగా మన హృదయ సింహాసనంలో కొలువయ్యేందుకు ఇద్దరు అనన్య భక్తులకు ఒకే కలగా, ఒకే సంకల్పాన్ని పాదుకొల్పడం 'దైవానికి' తప్ప ఎవరికి సాధ్యం. స్వప్న అనుభవాన్ని సాకారం చేసుకునేందుకు వెంటనే బూటీ, షామా ఇరువురూ కలిసి ఒక చక్కటి నమూనాను రూపొందించి దీక్షిత్ గారికి కూడా చూపించారు. అందరూ కలిసి శ్రీసాయి అనుమతికై అర్థించగా అప్పటికప్పుడే సమ్మతి లభించింది. వారందరి ఆలోచన ప్రకారం నట్టింట్లో (గ్రౌండ్ ఫ్లోర్) ఒక ఎత్తైన వేదికపై 'మురళీ'ధరుని విగ్రహము మరియు చక్కటి విశాలమైన హాలు మరియు చుట్టూ వసతికై గదులు ఉండాలని నిర్ణయం జరిగింది. శ్రీసాయి తాము మసీదు నుండి లెండీ వెళుతూ కొన్ని సూచనలు, సలహాలు కూడా ఇచ్చేవారు. అలా ఒకనాడు లెండీ వెళ్ళే సమయంలో మందిర నిర్మాణానికి పునాది వేయడానికి మంచిరోజును సూచించమని అడగడమూ, సంకల్పము కలిగిన క్షణమే సుముహూర్తమని అప్పటికప్పుడు కొబ్బరికాయ కొట్టడమూ జరిగిపోయాయి. 1917 వసం॥ నాటికే లక్ష రూపాయల ఖర్చుతో ఈ సౌధాన్ని నిర్మించాలని బూటీ తలచారంటే ధనంలో కాదు, ఆచరణలో వారు శ్రీమంతుడని గుర్తెరగవచ్చు. శ్రీసాయిబాబా అక్టోబర్ 15వతేదీ, 1918 సం॥ మహా సమాధి చెందారు. శ్రీసాయి భౌతికదేహంతో భక్తులకున్న ప్రేమబంధం, ఆ ఎడబాటును సహించలేక భక్తజనుల రాక తగ్గడంతో 1918-1922వ సం॥ల కాలంలో శిరిడీ కొంత మూగబోయింది. వారానికొకసారి మాత్రం



శ్రీసాయి సమాధికి అభిషేకం జరిగేది. అయితే ఘటనాఘటన సమర్థులైన శ్రీసాయి వాక్కు – సృష్టి వాక్కు. ఇక్కడ పెద్దలు వచ్చి సేవిస్తారన్నా, ప్రజలు చీమల బారుల్లా శిరిడీకి వస్తారన్నా, అది ఏదైనా సరే, జరిగేది మాత్రమే వారి నోటి నుండి వెలువడింది, నేటికీ అసంఖ్యాక సాయిభక్తుల కనులకు కనపడుతోంది. 1918వ సం॥ అక్టోబర్ 22వ తేదీన దీక్షిత్ గారి ఆధ్వర్యంలో పదిహేను మంది సభ్యులతో శ్రీసాయినాథ్ సంస్థాన్ కమిటీ ప్రారంభమయి, అక్టోబర్ 31వ తేదీ 1920 వసం॥ ఒక పాలరాతి సాయి విగ్రహాన్ని సమాధిపై కొలువుతీర్చాలని సంకల్పించారు. అయితే కావాల్సినంత ధనం లేకపోవడంతో ఆ ప్రయత్నం ఆలస్యమవుతూ వచ్చింది. శ్రీసాయి చిత్రపటాన్ని ఒక వెండి సింహాసనంలో పీతాంబర వస్త్రంతో చుట్టి, గంధం అలది, పూలమాలలతో అలంకరిస్తూ ఉండే వారు 1954 వ సం॥ వరకు.

భక్తుల బలమైన కోర్కెకు రూపంగా 1954వ సం॥ శ్రీసాయిబాబా సంస్థాన్ శ్రీసాయినాథుని చలువరాతి విగ్రహన్ని బాబా మహాసమాధిపై ప్రతిష్టించాలన్న ఆలోచన చేసింది. అందులో భాగంగా మహారాష్ట్ర ముఖ్య పట్టణమైన బొంబాయి మహానగరంలోని ప్రఖ్యాత శిల్పులను సంప్రదించి ఆ మహత్కార్యానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ముగ్గురు శిల్పులను కలిసి శ్రీసాయి చిత్రపటాన్ని వారికందించి ముందుగా వారు శ్రీసాయి ప్రతిమను (ప్లాస్టర్ ఆఫ్ పారిస్) రూపొందిస్తే, వారు తయారు చేసిన ప్రతిమలలో ఏ ప్రతిమ శ్రీసాయి ఆనంద స్వరూపానికి ప్రతిరూపమవుతుందో దానిని చలువరాతి మూర్తిగా మలచే కార్యాన్ని ఆ శిల్పికి అప్పగిద్దామని వారి సాలోచన. అలా శ్రీసాయి భక్తులైన కమిటీ వారు సంప్రదించిన, శ్రీసాయి ఎంచుకున్న ప్రఖ్యాత శిల్పకారుడు శ్రీబాలాజీ వసంత తాలిమ్. అప్పటి నిజాం ఏలుబడిలోని హైదరాబాద్‌లో బిల్డింగ్ కాంట్రాక్టర్‌గా ఉన్న వసంతరావుకు 1888 వ సం॥లో జన్మించారు బాలాజీ తాలిం. వారి చిన్న వయసులోనే తండ్రి చనిపోవడంతో తల్లీ, ముగ్గురు పిల్లలు కలిసి బొంబాయి మహానగరానికి వలస వెళ్ళారు.

ప్రఖ్యాత జె.జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో శిల్పకళలో ఆరితేరాక 'తాలిమ్ ఆర్ట్ స్టూడియో'ను వి.పి. రోడ్‌లోని, విఠల్ నివాస్‌లో ప్రారంభించారు. శ్రీబాలాజీ శిల్పకళలోనే కాక, చిత్రలేఖనంలోనూ ఎంతో రాణించారు. ఎన్నో అవార్డులు, పేరు ప్రఖ్యాతులతో పాటు తాత్వికంగాను, ఆధ్యాత్మికంగానూ, విలువలతో కూడిన జీవన విధానాన్ని కొనసాగించారు.



శ్రీసాయి సంస్థాన్ బాబా మూర్తిని తయారు చేయమనే నాటికి శ్రీబాలాజీ ఎప్పుడూ అంత పెద్ద మూర్తిని తయారు చేసి ఉండలేదు. సుమారు ఐదు అడుగులు పైబడి ఉండే మూర్తిని నేను చేయగలుగుతానా అన్న సందేహం వారి మదిలో ఉండిపోయింది.

ఒక మహాత్ముని రూపానికి మూర్తి (విగ్రహ) స్వరూపాన్ని రూపుదిద్దే క్రమంలో మరొక అత్యవసరం ఆ రూపాన్ని భిన్నకోణాల్లో చూసి ఉండడం. ఎందుకంటే మూర్తిని మలచే క్రమంలో ముక్కు, చెవులు, కళ్ళు, పలువరుస, నుదురు, ఇలా ప్రతీ కోణంలోనూ ఆ మూర్తి యొక్క కొలతలు – వారి స్వరూపానికి అద్దం పట్టాలి. అంతకంటే ముఖ్యమైన విషయం ఆ రూపంలో సహజంగా ఉండే, ఉట్టిపడే కరుణార్ణవ భావం. ఈ భావాలను అనుభవిస్తే, అనుభూతి చెందితే కానీ శిల్పికి అతను చేసే పనిలో పరిపూర్ణత్వం సిద్ధించదు. మరోవంక శ్రీసాయి సంస్థాన్ సభ్యులు శ్రీబాలాజీకి చేతికందించింది కేవలం శ్రీసాయి చిత్రపటం మాత్రమే, అదీ శ్రీసాయికి ఎదురుగా నిలబడి తీసుకున్నది. కనుక ఒక్కవైపు నుండి మాత్రమే సాయిని దర్శించగలం ఆ చిత్రపటంలో. 1954వ సం॥ మొదట్లో ప్రారంభమయి, శ్రీసాయి ప్రతిమ రూపుదిద్దుకోవడంలో రెండు మూడు నెలల పాటు శ్రమించినా శ్రీబాలాజీకి మాత్రం తృప్తి లభించలేదు. సహజమయిన శ్రీసాయి రూపం ఎలా ఉంటుందో తెలిస్తే గానీ, వారు చేస్తున్న ప్రతిమకు పూర్ణత్వం లభించదని వారి భావన. ఈ క్రమంలో ఎంతో సంఘర్షణకు గురి అవుతున్న రోజుల్లో ఒకనాడు తన నిత్యక్రమంలో భాగంగా శిల్పశాలకు చేరిన శ్రీబాలాజీ అక్కడ బాబా ప్రతిమపై ఉన్న పరదాను తీసి, మెరుగులు దిద్దే క్రమంలో భాగమయ్యే సమయంలో గదిలో లైటు వేసే పూర్వమే, శ్రీసాయి ప్రతిమ ప్రక్కనే మూర్తి స్వరూపంలో అంటే మూడు కోణాలలోనూ ఉన్న శ్రీసాయి స్వరూపం స్పష్టంగా గోచరించింది. ఇది కల కాదు కదా అని గమనించుకునే సమయంలోనే వారికి శ్రీసాయి యొక్క పూర్తి స్వరూపం అవగతమై అన్ని కోణాల్లోనూ బాబా రూపం తన మనోఫలకంపై ముద్రించుకుపోయింది. ఆశ్చర్యానికి లోనైన శ్రీబాలాజీ కొంచెం తేరుకున్నాక శ్రీసాయి యొక్క అనుగ్రహ విశేషాన్ని అర్థం చేసుకున్నారు. బాబా వర్షించిన కృపా వర్ష నిజదర్శనంతో రెండురోజుల్లోనే శ్రీసాయి యొక్క ప్రతిమకు తుదిమెరుగులు దిద్దారు, కుటుంబ సభ్యులతో తప్ప ఈ అనుభూతిని ఇతరులతో పంచుకోలేదు శ్రీబాలాజీ. ఇంతకుముందు అనుకున్నట్లుగానే శ్రీసాయి సంస్థాన్ సభ్యులు, బాబాను ప్రత్యక్షంగా దర్శించుకున్న భక్తుల బృందం తాలిమ్ స్టూడియో చేరుకున్నారు. శిల్పశాలలో శ్రీసాయి ప్రతిమపై ఉన్న పరదాను తొలగించి,



శ్రీసాయి ప్రతిమను చూపించాక ఆనంద భాష్పాలతో కన్నీటి పర్యంతమయ్యారు శ్రీసాయి ప్రత్యక్ష భక్తులు. "ఏ కరుణార్ద్ర దృక్కులు మేము శ్రీసాయిలో సంవత్సరాల పర్యంతం దర్శించుకున్నామో అవి ఈ ప్రతిమలో ఉట్టి పడుతున్నాయి" అని సంతోషపరవశులయ్యారు. ఆ ఆనందస్వరూపుని మూర్తి భక్తుల మనోఫలకాలలో నిలుపుకునేందుకు అలా తొలి అడుగుపడింది. శ్రీసాయి అనే అఖండ వెలుగుకు చిరుదీపంగా ఈ ప్రతిమ కొలువు తీరింది. శ్రీసాయి సంకల్పం అనుక్షణమూ ఎరుకలోనికి వస్తుంది మనం జరిగిన సంఘటనల సమాహారాన్ని ఒక పూదండగా కూర్చుకుంటే. ఇక శ్రీసాయినాథుని మూర్తి ఎలా రూపుదిద్దుకుందో చూద్దాం. శ్రీబాలాజీ తాను తీర్చిదిద్దే మూర్తుల (విగ్రహాల) కోసం రాజస్థాన్ నుంచి చలువరాయిని తెప్పించుకోవడం సహజంగా చేసే కార్యక్రమం. అలాగే శ్రీసాయినాథుని విగ్రహం కోసం కూడా అక్కడి చలువరాతి గని యజమానికి కబురు చేయగా, రాబోయే రెండు, మూడు నెలల్లో పంపుతానని తెలియచేసారు. ఇదిలా ఉంటే ఒకరోజు తనకు ఎప్పటి నుంచో మంచి స్నేహితుడైన అతను తాలిమ్ శిల్పశాలకు రావడం, మాటల్లో శ్రీబాలాజీ-శ్రీసాయినాథుని ప్రతిమను తయారు చేసానని, అది సంస్థాన్ భక్తులకు బాగా నచ్చిందని, దాని ఆధారంగా విగ్రహాన్ని తయారు చేయడానికి రాజస్థాన్ నుండి చలువరాయి కోసం పురమాయించానని చెప్పాడు తన మిత్రునితో. ఈ మిత్రుడు బొంబాయి డాక్‌యార్డులో పనిచేసే ఉద్యోగి. అతనికి ఎలా తట్టిందో గానీ, శ్రీబాలాజీగారికి ఇలా చెప్పాడు. "సుమారు ఒకటిన్నర సంవత్సరం నుండి, ఒక పెద్ద శిల మన బొంబాయి డాక్‌యార్డులో ఉండి పోయింది. చాలా పెద్ద పరిమాణంలో ఉన్న ఆ శిలను ఎవరు తెప్పించారో, ఎందుకు వచ్చి తీసుకోలేదో తెలియదు. రెండు సార్లు వేలం వేసినా సరే దానిని ఎవరూ తీసుకోలేదు, దానితో ఆ శిలను ఒక ప్రక్కన పెట్టేసి ఉంచారు. అది నీకేమైనా ఉపయోగపడుతుందేమో! గమనించుకో" అంటూ ఒక మాట చెప్పాడు. ఏదో ఒక సాధారణమైన శిల అయి ఉంటుందని భావిస్తూనే, నాలుగైదు రోజుల తర్వాత ఒక సుత్తి, ఉలి తీసుకుని వెళ్ళి ఆ శిలను పరీక్షించారు శ్రీబాలాజీ. శ్రీసాయి మూర్తిని తయారు చేయడానికి ఏ పరిమాణము, ఏ కొలతలు అవసరమో అదే ఆ చలువరాతి శిలలో గమనించడం, అంతేకాక ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కరారా మార్బుల్‌కు సంబంధించిన ఆ పెద్ద రాయి అక్కడకు ఎలా వచ్చిందో కానీ, దానికి ఎవరూ యజమానిగా ముందుకు రాకపోవడం గుర్తు చేసుకుని ఇది కేవలం

సాయిసంకల్పం మాత్రమేనని - వారి మూర్తి తయారీకై సంవత్సరం పూర్వమే శ్రీసాయి ఆ



శిలను తెప్పించి ఉంచారని అర్థం చేసుకున్నారు బాలాజీ. మైకలాంజిలో, ఆంటోనియో కనోవా వంటి ప్రపంచ ప్రఖ్యాత శిల్పులు తాము చెక్కిన జగద్విఖ్యాత శిల్పాలకు వాడింది ఈ కరారా చలువరాయినే. నిజానికి ఇరవయ్యవ శతాబ్ది చివరకు ఈ స్థాయి చలువరాయి దొరకడం మృగ్యమైపోయింది. ఈ శిలను గూర్చి శ్రీబాలాజీ, సంస్థాన్ వారికి తెలియజేయడంతో వారు డాక్‌యార్డు వారికి ఈ శిలకు ధరను చెల్లించి తాలిమ్ శిల్పశాలకు తరలించారు. జరిగే ప్రతీ సంఘటనలో శ్రీసాయి అనుగ్రహ రాజముద్రలు కానవస్తూనే ఉన్నాయి. బొంబాయి డాక్ యార్డులో దాచి ఉన్న వజ్రంలా శ్రీసాయి మూర్తి కోసమే ఈ శిల వెలుగులోకి వచ్చింది, కాదు కాదు శ్రీసాయి అనుగ్రహ వెలుగులతో సరియైన స్థానం చేరింది.

సాయిభక్తులు, సంస్థాన్ ప్రతినిధుల సమ్మతితో శ్రీసాయి ప్రతిమ ఆధారంగా చలువరాయి విగ్రహం రూపుదిద్దుకోవడం ప్రారంభమయింది. తాలిం శిల్పశాలలోని మరికొందరు శిల్పులు సాయి దివ్య మంగళరూపాన్ని తీర్చిదిద్దుతున్నారు. రోజు రోజుకూ సాయి రూపం ఎంతో చక్కగా వ్యక్తమవుతుండడంతో శిల్పులందరూ ఉత్సాహంగా ఆ మహత్కార్యంలో పాలుపంచుకుంటున్నారు. సుమారు రెండు, మూడు నెలలకు యాభై శాతం మూర్తి రూపు దాల్చింది. శిక్షణ–రక్షణ అనే రెండు రథచక్రాలపై తన భక్తుని జీవితానికి సారథిగా నిలిచే శ్రీసాయి లీలా వినోదం ఇలా వ్యక్తమయ్యింది. శ్రీసాయి ఎడమ పాదానికి పైభాగాన, కుడి పాదానికి క్రింద ఉన్న చలువరాయి భాగంలో శ్రీబాలాజీ మరియు ఇతర శిల్పకారులు చెక్కుతూ వెళుతున్న సందర్భంలో పదిహేను రోజులు గడిచాయి. ఉన్నట్లుండి ఆ భాగంలో ఒక విభిన్నమైన, గాజును పగలగొడితే వచ్చే ధ్వని లాంటి శబ్దం రావడం మొదలయ్యింది. ఇంకొంచెం లోతుకు వెళ్ళేసరికి స్పష్టంగా ఒక పగులు ఉందనిపించింది. అది పగులైనా కావచ్చు లేదా ఆ భాగంలోపల ఉండిపోయిన గాలి బుడగ అయినా కావచ్చు. అందుకనే ఆ శబ్దం వస్తుందని భావించారు శ్రీబాలాజీ. ఈ సందేహంతో చింతించిన శ్రీబాలాజీ సాయిని ప్రార్థించి, బాబా! మీరే ఈ సమస్య నుండి గట్టెక్కించాలి. మీ ఆశీస్సులు కావాలని కోరుకుంటూ తర్వాత రోజైన గురువారం కుడికాలి క్రింది భాగంలో పని చేయడం ప్రారంభించారు. కొంత సేపట్లోనే ఒక పగులు కన్పించింది. రాయి యొక్క సహజ ధర్మమైన ఆ పగులు ఎక్కడివరకైనా ఉండవచ్చు. కానీ చలువరాయిలో సహజంగా అది సరళరేఖగానే ఉంటుంది. ఈ సహజ ధర్మాన్ననుసరించి శ్రీసాయి పాదమైనా విడివడిపోవచ్చు లేదా కాలి వ్రేలి భాగమైనా



విడివడవచ్చు. ఈ ఆలోచనే శ్రీబాలాజీని కలతకు గురి చేసింది. కానీ శ్రీసాయిమూర్తిని పూర్తి చేయక మరో దారి లేదు, ఎందుకంటే సుమనోహర సాయి రూపం మరులుగొలిపేటట్లు ఎంతో సుందరంగా దర్శనమిస్తోంది  పై భాగంలో.

ఆశ్చర్యం అంబరమంటేలా సరళరేఖగా చివరి వరకు విడివడాల్సిన భాగం, భిన్నంగా వక్రంగా (Arch) విడివడి క్రింద పడిపోయింది. నిజమైన శిల్పి మాత్రమే రాయిలో ఉన్న అనవసర భాగాన్ని మాత్రం నేను తొలగించాను, విగ్రహమనే అద్భుత మూర్తి – దైవసృష్టి అని తెలియచెపుతాడు. అలా అనవసర భాగాన్ని తొలగించిన సృష్టి శిల్పి శ్రీసాయినాథుడే! శ్రీబాలాజీ వసంత తాలిం మనసు కుదుట పడింది, ఆ ఆనందస్వరూపుని లీలా వినోదాన్ని ఓ వంక, అంత పెద్ద మూర్తిని ఎప్పుడూ చేయని తనచే శ్రీసాయి చేయించుకున్న విగ్రహరూపం మరోవంక. శ్రమ, లీల, అనుభవం, అనుభూతి అన్నీ కలిసి సకల మానవాళి మదిలో సదా నిలిచిపోతున్న సాయినాథుని దివ్యమంగళరూపం. కొన్ని పిచ్చుకల కాళ్ళకు దారం కట్టి తన చెంతకు లాక్కొని వారిచే ఈ మహత్తర కార్యక్రమం చేయించారు శ్రీసాయి. నాటి చరిత్రకు, నేటి వర్తమానమే సాక్ష్యం, రోజు రోజుకూ పెరుగుతున్న భక్తజనుల బారులే శ్రీసాయి మాటలకు మనం దర్శించుకోబోతున్న భవిష్యత్తు. “ఇది తరించే స్థలం” అన్న బాబా వాక్కు నిత్యసత్యమై సమాధి మందిరం అనుగ్రహాశీస్సుల ద్వీపంలా అలరారుతోంది. తన మంగళస్వరూపాన్ని తీర్చిదిద్దడానికి శ్రీసాయియే ఎంచుకున్న ధన్యజీవి శ్రీబాలాజీ వసంత తాలిం. తరతరాలు తరించడానికన్నట్లు ఈనాటికీ శ్రీబాలాజీ వసంత తాలింగారి మనవడు శ్రీరాజీవ్ హరీష్ తాలిం ఆనాటి శ్రీసాయి ప్రతిమ ఆధారంగా శ్రీసాయి దివ్యమంగళ స్వరూపాలైన విగ్రహాలను తయారు చేస్తున్నారు. అదే కరారా ప్రాంతం నుండి పొందిన చలువరాయితో రూపుదాల్చిన బాబా రూపాన్ని అరుణగిరి గిరివాలం హరితాచల మందిర ప్రాంగణంలోనూ, ఒంగోలు సాయిబాబా సెంట్రల్ స్కూలు, నెల్లూరు, బొడ్డపాడు సాయిపథం బాబా మందిరాలలో దర్శించుకోవచ్చు.

ఎన్నో లీలా విశేషాలకు ఆలవాలమైన శిరిడీలోని బాబా దివ్యమంగళ స్వరూప ప్రాణప్రతిష్ట అక్టోబర్ 7వ తేదీ 1954వ సం॥స్వామి శరణానందగారి పవిత్రహస్తాలతో చేయబడింది. తన మూడేళ్ల వయస్సులో తీవ్ర అనారోగ్యానికి గురై సాయి స్వహస్తాలతో ఇచ్చిన ఊదీతో స్వస్థుడైన వామనరావు పటేల్ కాలాంతరంలో అనన్య సాయిభక్తుడై సాయినాథుని తొలి పూజను చేయడం, భగవంతునికి భక్తునికి ఉండే మమతానురాగల మాతృబంధాన్ని గుర్తు చేయక మానదు.



సరిగ్గా అదేరోజు, అక్టోబర్ 7వ తేదీ, 1954 వ సం॥ సాయినాథుని దివ్య ప్రాణప్రతిష్ట జరిగిన రోజునే, ఇటు దక్షిణాపథాన అనన్య సాయిభక్తికి ఆచంద్ర తారార్కమైన వేగుచుక్క-భక్తి, జ్ఞాన వినీలాకాశంలో జననమొందింది. చరాచర సృష్టి ఉన్నంత కాలం సాయిభక్తి గగనంలో ధ్రువతారగా వెలుగొందుతుండే సద్గురుచంద్రుని జననం ఆనాడు ఎట్టి ఆడంబరమూ, హడావిడి లేకుండానే జరిగిపోయింది.

శ్రీసురేంద్రబాబు, శ్రీమతి వెంకటరత్నమ్మలకు ప్రథమ పుత్రునిగా, ముద్దులొలికే గారాల బాలునిగా జన్మించారు శరత్‌బాబు. వారి జననమే కాదు, వారి గమనమూ అనుపమాన సుచరితమే, భక్త జనులకు సచ్చరిత్రమే! వారు అవతార వరిష్ఠులే! సత్యద్రష్టలే ! దైవాంశ సంభూతులే! సందేహమే లేదు. సాయినాథుని ప్రాణప్రతిష్టనాడు జననము, అందునా మురళీధరుడైన 'శ్రీకృష్ణుని' స్థానమును చేరిన సాయినాథుని మూర్తిమత్వము.

శ్రీమతి వెంకటరత్నమ్మగారు గర్భవతిగా ఉండగా రెండు స్వప్నములు వచ్చేవని, వాటిలో మొదటిది వినీలాకాశ ఇంద్రధనస్సుల మధ్య ముక్కోటి దేవతలతో కలిసి త్రిమూర్తులు తమ వైపు చూస్తుండే వారని, మరో స్వప్నంలో యమునాతటిపై వెంకటరత్నమ్మగారు కూర్చుని ఉండగా బాలకృష్ణుడు వారి ఒడిలో వాలడము, ఆ బాలకృష్ణుని తాను ఆడించడము జరుగుతుండేవని పెద్దలు చెప్పగా విన్న మాట. "అవతరసీ తూ యేతా ధర్మాన్‌తే గ్లానీ" అని శ్రీభీష్మ వచించినట్లు ధర్మానికి గ్లాని కలిగిన ప్రతీసారీ జగద్గురువుగా ప్రభవిస్తూనే ఉన్నారు సద్గురుచంద్రులు. అలా **బాబా విగ్రహప్రతిష్ట నాడు జన్మించిన శరత్‌బాబు కాలాంతరంలో సమున్నత సాధనా శిఖరమై, తత్వాన్వేషణా సౌరభమై, అనన్య సాయిభక్తిని అణువణువూ నింపుకున్న ఆచార్యతత్త్వమై, సుజ్ఞాన తేజో పుంజమై, ఛాందస భావాల లోగిళ్ళలో చీకట్లను శమింప చేసి సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీగా సాయిభక్తుల హృదయసీమల కొలువుతీరారు. శిరిడీ సాయినాథుని దివ్యమంగళ స్వరూప దర్శనము శుభకరము. సాయినాథుని శరత్‌బాబూజీ సన్నిధాన సందర్శనము అనన్య సాయిభక్తికి ఆద్యము .. ఆశ్రయించినవారు కాగలరు శ్రీసాయి చరణ నివేదనము...**

**- మహేష్, మోతీనగర్**



**భక్తుడు :** గురువుగారూ! "సాయివంటి దైవంబు లేడోయి లేడోయి" అన్నారు కదా. అది ఏ విధంగా అనేది వివరిస్తారా?

**గురువుగారు :** మన ప్రేమ యొక్క వ్యక్తీకరణ. అంతే తప్పితే, మిగతా వాళ్ళెవరూ లేరని కాదు నా ఉద్దేశ్యం. మళ్ళా అదే ఉదాహరణ. మనకెవరైనా ఒక వ్యక్తి మీద ప్రేమ ఉంటే, ఆ వ్యక్తి అందరికంటే మోస్ట్ బ్యూటీఫుల్, అంతకు మించిన సుగుణవతి ఇంకెవ్వరూ లేరనిపిస్తుంది. అట్లాగే నాకు ఆయనిష్టం. అటువంటి రూపం లేదని నేనంటాను. నాకిష్టమైన రూపం అది. అందర్నీ అట్లాగే అనమనీ కాదు, లేకపోతే ఇంకేదో ఒక మిషనరీ ప్రచారంలాగా చేయడం కాదు ఉద్దేశ్యం. అది మన ప్రేమను వ్యక్తం చేసేటువంటి రూపం. ఎవరి దేశం వాళ్ళకు గొప్ప, ఎవరి ఇల్లు వాళ్ళకి గొప్ప, ఎవరి ఊరు వాళ్ళకు గొప్ప, ఏమయ్యా, ఎవరి ఊరు వాళ్ళకు గొప్ప కాదూ?

**భక్తుడు :** అవును సార్!

**గురువుగారు :** నెల్లూరు వాళ్ళు అబ్బా! మా నెల్లూరు కంటే మించింది లేదు అంటారు. గుంటూరు వాళ్ళు అబ్బా మా గుంటూరంటారు. ఏమీ లేదు. దీనికంటే గొప్ప, తక్కువ అంటూ ఏమీ ఉండవు. అది మన ప్రేమను వ్యక్తం చేసే రూపం, అంతే.

**భక్తుడు :** అంటే ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలోనే బాబా రూపం అపురూపమని చెప్తున్నారు కదా!

**గురువుగారు :** అపురూపమే! అపురూపం ఎందుకో కూడా చెపుతుంది. ఊరికినే అపురూపం అనడం కాదు. ఏ రకంగా అపురూపమో కూడా చెపుతుంది. అందుకని అపురూపం అట్లా కాదండీ, ఇటువంటి అపురూపాలు ఇంకా చాలా ఉన్నారని ఎవరైనా అంటారేమో? అంటే అన్నారు. నాకీ అపురూపం నచ్చింది కాబట్టి నాకిదే గొప్ప. **అపురూపం కాబట్టి నాకు ఇష్టం అనలేదు, బాబా కాబట్టి ఇష్టం.** ఎందుకో తెలియదు. దానికి కారణమేమీ లేదు. ప్రేమించేదానికి ఒక కారణం వెతుక్కోవలలసిన అవసరం ఉండదు. ఎందుకో పుట్టింది.

– గురువుగారి అనుగ్రహభాషణల నుండి



అనంతమైన ప్రేమ ఆర్తులకోసం
ఆనందస్వరూపంగా ఆకృతి దాల్చింది...
ఆవ్యాజ కరుణామయుని క్రీగంటి చూపు,
అమృతమై కురిసి, తన్మయమై మెరిసి,
అదే రోజున, అదే పర్వదినాన...
మహిన వెలిసింది, మనసు మురిసింది...
సాయినాథుని ప్రాణప్రతిష్ఠ జననమై,
తమ గురుచంద్రుల జన్మదినాన అమరమైన,
అత్యంత అరుదైన సద్గురు స్వరూపం...
శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ చరణాలకు...

**మనసా, వచసా, శిరసా...**
**వందన చందనం!**


gurukrupa.info
+91 83672 00045